
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 22 ఫిబ్రవరి 2025





పవర్ ఆయనదే..!

ప్రొద్దుటూరులో విద్యుత్ శాఖను ఓ కాంట్రాక్టర్ తన గుప్పిట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నాడు. ప్రభుత్వం ఏదైనా సరే తన హవానే అక్కడ కొనసాగుతుంటుంది. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లుకు, ఆయన బావమరిది బంగారురెడ్డికి బంటులా ఉండి ఆ శాఖలో పనులు చేపట్టి ఎవ్వరికి అవకాశం లేకుండా చేసి కోట్లు గడించాడని ప్రచారం ఉంది. ఇప్పుడూ అదే పెత్తనం కొనసాగుతోంది. ఆ కార్యాలయంలో తన ఆధిపత్యానికి తన పనులకు ఎవ్వరు అడ్డుపడ్డా అక్కడ ఆ అధికారులు బదిలీపై వెళ్లాల్సిందే. ఇతర కాంట్రాక్టర్లు ఎవ్వరు పనిచేసినా తనకు కమీషన్ ఇవ్వాల్సిందే. ఇతను చేసిన పనులు సైతం నాసిరకంగా ఉన్నా అధికారులు వాటి నాణ్యతను పరిశీలించకనే బిల్లులు చేయాల్సిందే. అప్పుడు వైసీపీలో.. ఇప్పుడు కూటమిలోనూ ఆ కాంట్రాక్టర్ ఎమ్మెల్యే పేరు చెప్పుకుని విద్యుత్ శాఖ కార్యాలయంలో తన పవర్ చూపుతున్నాడు.

- ప్రొద్దుటూరు విద్యుత్ కార్యాలయంలో కాంట్రాక్టర్ హల్ చల్
- తన పనులు చేయకుంటే బదిలీలంటూ అధికారులకు బెదిరింపు
- కార్యాలయ ఉన్నతాధికారిని గుప్పిట్లో పెట్టుకుని దందా
- వైసీపీ హయాంలో కోట్లు గడించిన కాంట్రాక్టర్
- కూటమి ప్రభుత్వంలోనూ చక్రం తిప్పుతున్న వైనం

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్ సెక్షన్‌లు అర్బన్ పరిధిలో ఉన్నాయి. రామేశ్వరం, ఖాదరబాదర, రాజుపాళెం సెక్షన్లు రూరల్ పరిధిలో ఉన్నాయి. రామేశ్వరం, ఖాదరబాదర సెక్షన్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. వీటిలో ఎక్కువగా వెంచర్లు వేసి కొత్తగా నిర్మాణాలు సాగుతూ విద్యుత్ కాంట్రాక్టు పనులు ఉంటాయి. రామేశ్వరం సెక్షన్‌లో పనిచేస్తున్న ఓ ఏఈ బదిలీ కాకుండా ఉండాలంటే తనకు రూ.5లక్షలు ఇవ్వాలని ఈ కాంట్రాక్టర్ బెదిరించాడు. అతను బదిలీ అవుతానే కానీ డబ్బులు ఇవ్వనని చెప్పాడు. దీంతో దీంతో రోజులు తిరగక ముందే ఆ ఏఈపై అవినీతి ఆరోపణలు చేయించి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సిఫారసుతో బదిలీ చేయించాడని ప్రచారం సాగుతోంది. తనకు అనుకూలమైన ఈ ఏఈని రామేశ్వరం సెక్షన్‌కు వేయించుకుని ఏకంగా ఈ కాంట్రాక్టర్ దందా మొదలు పెట్టాడు

వసూళ్ల పని ఆయనదే

రామేశ్వరం పరిధిలోని థర్మల్ ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఓ వ్యక్తి ప్రైవేటు వెంచరు వేసి అందులో స్తంభాలు నాటి లైన్లు లాగి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి రూ.11.70 లక్షలు డబ్బులు విద్యుత్ శాఖ ఖాతాలో ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాడు. అతనికి రెండు నెలలు దాటినా స్తంభాలు రాలేదు. కరెంటు లేదు. ఆ పనులు చేయాలంటే డిపార్ట్‌మెంట్‌లో డీఈ ఏఈలకు రూ.2లక్షలు ఇవ్వాలని సదరు కాంట్రాక్టర్ డిమాండ్ చేశాడు. విధిలేక కాంట్రాక్టరుకు ఆ వ్యక్తి రూ.2 లక్షలు సమర్పించుకున్నాడు.

వైసీపీ హయాంలో కోట్లు గడించాడు

వైసీపీ హయాంలో సదరు కాంట్రాక్టర్ జగనన్న కాలనీలో విద్యుత్ శాఖకు సంబంధించి పనులు దక్కించుకుని కోట్ల రూపాయలు ఆర్జించాడని డిపార్ట్ మెంటులో ప్రచారం ఉంది. ఇక వైసీపీ హయాంలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్‌లు వెలిశాయి. ఆ వెంచర్లలో డిపార్ట్‌మెంటు ద్వారా పోల్స్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు దక్కించుకుని పెద్ద ఎత్తున సంపాదించాడని చెబుతున్నారు. అందువల్లే ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యేకి ఎన్నికల సమయంలో కోటి రూపాయలు విరాళం ఇచ్చాడని కూడా ఆ కాంట్రాక్టరే బహిరంగంగా ప్రచారం చేసుకుంటున్నాడని చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ..

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ కాంట్రాక్టర్ చక్రం తిప్పుతున్నాడు. విద్యుత్ కార్యాలయంలో పనులకు ఎమ్మెల్యే లెటర్లను విరివిగా వినియోగించుకుంటున్నాడని చెబుతున్నారు. ఇటీవల ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను తిరుపతి సీఎండీ దగ్గర ఎమ్మెల్యే సిపారసుతో సదరు కాంట్రాక్టరు పైరవి చేయించి కొన్ని మంజూరు చేయించాడు. ఇందులో ఎమ్మెల్యే సిఫారసుతో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు దక్కించుకున్నారు. మరికొందరి వద్ద సదరు కాంట్రాక్టరు పోల్ టూ పోల్ ఫీల్డ్ అసిస్టెంటు పోస్టుకు రూ.6 లక్షల వంతున వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

ఎమ్మెల్యే పేరు చెప్పుకుని దందా..

అధికార టీడీపీ ఎమ్మెల్యేకు ఎన్నికల్లో ఆర్థిక సహాయం చేశానని, తాను ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంటులో ఎంతచెప్పితే అంత అని సదరు కాంట్రాక్టర్ చెప్పుకుంటున్నాడు. డిపార్ట్ మెంటులో ఏపని కావాలన్నా.. ఏ అధికారి సబ్‌డివిజన్‌లో పనిచేయాలన్నా ఎవరిని బదిలీచేయాలన్నా.. అంతా తాను చెప్పినట్లు నడవాల్సిందే అని హుకుం జారీ చేస్తున్నాడు.



ప్రొద్దుటూరు డివిజన్ విద్యుత్ శాఖకు తనకు బంధువు అయిన వ్యక్తినే ఉన్నతాధికారిగా ప్రస్తుత ఎమ్మెల్యేతో సిఫారసు చేయించి ఈ కాంట్రాక్టరు

ఉన్నతాధికారిని గుప్పిట్లో పెట్టుకుని..

వేయించుకున్నాడనే ప్రచారం ఉంది. ఆ ఉన్నతాధికారిని తన గుప్పిట్లో పెట్టుకుని సబ్‌డివిజన్ పరిధిలో ఎక్కడ వర్కులు ఉన్నా తానే దక్కించుకుంటున్నాడని అంటున్నారు.

నిన్నటి వరకూ వైసీపీ పంచన ఉండి హవా కొనసాగించి.. ప్రభుత్వం మారగానే టీడీపీ పంచచేరడం ఆ పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంలో కూడా ఆ కాంట్రాక్టర్‌కే ప్రాధాన్యత ఇవ్వడంపై ఎమ్మెల్యే అనుచర వర్గంలోనే అసంతృప్తి వెల్లువెత్తుతోంది. ప్రొద్దుటూరులో సబ్‌స్టేషన్ల కాంట్రాక్టులను సైతం ఎమ్మెల్యే ఈ కాంట్రాక్టర్‌కే ఇవ్వడంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. అందులో ఒకే సామాజిక వర్గానికి తప్ప ఇతర సామాజిక వర్గాలకు కాంట్రాక్టు పనుల్లో ఎలాంటి ప్రాధాన్యత లేదని వాపోతున్నారు.

మన జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

జాగ్రత్తలతో

చికెన్ తినొచ్చు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



పశువైద్యాధికారి జి.రాంబాబు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూతో ఆం దోళన వద్దని, జిల్లాలో ఆ లక్షణా లు లేవని పశుసం వర్ధక శాఖలో ని పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో వైద్యులుగా పనిచేస్తున్న జి.రాంబాబు తెలిపారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా బర్డ్‌ఫ్లూ వ్యాధి గురించే చర్చ సాగుతోంది. కోళ్లకు వైరస్ రావడంతో పౌల్ట్రీ రంగం దెబ్బతింటోంది. మరోపక్క మాంసపు ప్రియుల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో వ్యాధి నిర్ధారణ ప్రయోగ శాల డాక్టర్‌తో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ.

ప్రశ్న: బర్డ్‌ఫ్లూ వ్యాధి అంటే ఏమిటి

జవాబు: ఏవీఎస్ ఇన్‌ఫ్లూయెంజా అనే వైరస్ వల్ల కలిగే వ్యాధి. ఇది ప్రధానంగా కోళ్లు, బాతులపై ప్రభావం చూపుతుంది. మనదేశంలో మొదటిసారి 2006లో గుర్తించారు. ప్రస్తుతం గోదావరి జిల్లాల్లో ఈ కేసులు నమోదయ్యాయి. అయితే ప్రభుత్వం తీసుకున్న నియంత్రణ చర్యల వల్ల వైరస్ వ్యాధి వ్యాప్తి చెందడం లేదు.

ప్రశ్న: ఈ వ్యాధి అంటే ఎందుకు భయపడుతున్నారు

జవాబు: ఈవ్యాధి కోళ్ల నుంచి మనుషులకు సంక్రమించవచ్చని నిర్ధారణ కావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంటోంది. కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారే అవకాశాలు కూడా లేకపోలేదు. అందువల్లే ఈ వ్యాధి పట్ల ప్రస్తుతం ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రశ్న: కోళ్లలో వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి?

జవాబు: ఈకలు చెల్లాచెదురుగా ఉంటాయి. గుడ్ల ఉత్పత్తి తగ్గిపోతుంది. శరీర అవయవ పనితీరు సరిగా ఉండదు. వ్యాధి తీవ్రమైతే 48 గంటల్లోపు కోళ్లు చనిపోతాయి.

ప్రశ్న: ఈవైరస్ ఎలా వ్యాప్తి చెందుతుంది

జవాబు: వైరస్ సోకిన కోళ్ల ద్రవాలు, విసర్జనల ద్వారా.. కలుషితమైన ఆహారం నీటి ద్వారా.. అలాగే బర్డ్‌ఫ్లూతో వ్యాధితో మృతిచెందిన కోళ్లను సమీపంలో ఉంచడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

ప్రశ్న: మనుషులకు ఎలా సోకుతుంది.

జవాబు: వైరస్ సోకిన కోళ్లతో ప్రత్యక్షంగా ఉండడం, కోళ్ల ఉత్పత్తులను సరైన విధంగా శుభ్రం చేయకపోవడం వల్ల వ్యాధి మనుషులకు సోకుతుంది. జ్వరం దగ్గు తలనొప్పి శ్వాసకోశ సమస్యలు కండరాల నొప్పులు, గొంతునొప్పి, తీవ్రమైన పరిస్థితుల్లో నిమోనియ, శ్వాస ఆడకపోవడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి.

ప్రశ్న: ఎలా నివారించవచ్చు

జవాబు: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు తరచూ చేతులు సబ్బుతో కడుక్కోవాలి. చికెన్, గుడ్లను కనీసం 70సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రతతో వండుకోవాలి. రక్షణ కిట్లు (చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్క్) ధరించాలి. వైరస్ సోకిన కోళ్ల సమీపానికి వెళ్లకుండా ఉండడం మంచిది. చనిపోయిన కోళ్లను కూడా తాకకూడదు.

ప్రశ్న: చికెన్, గుడ్లు తినొచ్చా

జవాబు: పూర్తిగా శుభ్రంగా సరిగా ఉడికించిన చికెన్, గుడ్లు తినడం సురక్షితం. బర్డ్‌ఫ్లూ వైరస్ 70సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో నశిస్తుంది. కాబట్టి చికెన్ పక్కాగా వండితే వైరస్ మిగలదు. అయితే మాంసాన్ని తాకిన తర్వాత చేతులను సబ్బుతో కడుక్కోవడం, వండే సమయంలో పరిశుభ్రత పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రశ్న: మన జిల్లాలో పరిస్థితి ఏమిటి?

జవాబు: జిల్లాలో ఇంత వరకు బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలు ఎక్కడా కనిపించలేదు. తగిన జాగ్రత్తలు తీసుకుని చికెన్, గుడ్లు తినొచ్చు.

వా'నర' బంధం

మనుషుల మధ్య బంధాలు పలుచనవుతున్నాయి. కన్నతల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు.. తోబుట్టువులను దరిచేరనివ్వని సోదరులు.. జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా ఉంటామంటూ పెళ్లినాడు ప్రమాణం చేసుకుని నిత్యం శత్రువుల్లా ఘర్షణపడుతున్న వారూ ఎందరో.. వీరందరికీ భిన్నంగా నోరులేని వానరం.. ఆ వానరం ఆధారంగా జీవనం సాగించే నరుడి మధ్యన అపురూపబంధం నెలకొంది.. ఇలా కడప 1 టౌన్ వద్ద శుక్రవారం రాత్రి ఆదమరిచి హాయిగా నిద్రపోతూ కనిపించారు.

(కడప క్రైం-ఆంధ్రజ్యోతి)



ఆర్బీఎస్కే మొబైల్ వాహనాలు ప్రారంభం



వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే) మొబైల్ వాహనాలు రెండింటిని కలెక్టరేట్‌లో శుక్రవారం ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వస్థ్యలో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో, ప్రభుత్వ పాఠశాలలో చదు వుతున్న 18 సంవత్సరాల లోపు పిల్లల కు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తార న్నారు. ఈ కార్యక్రమం గతేడాది నవం బరు 14వ తేదీన ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించార న్నారు. బాల స్వస్థ్యలో ఆరోగ్య సమస్యలు గుర్తించిన పిల్లల ను జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి రెఫర్ చేస్తామన్నారు. జిల్లాలో ప్రొద్దుటూరు, కడప రిమ్స్‌లో సత్వర చికిత్స కేంద్రాలు ఉన్నాయన్నారు. చికిత్స అనంతరం తిరిగి వారి స్వస్థలాలకు చేరుస్తారన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, పీవో డాక్టర్ రమేశ్, ప్రోగ్రాం అధికారులు నవీన్‌కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి 317 ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు 25వ తేదీ నుంచి 317 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి వెల్లడించారు.

కడప డిపో నుంచి పొలతలకు 78, నిత్యపూజకోనకు 40, శ్రీశైలానికి 2 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పులివెందుల నుంచి పొలతలకు 27, భానుకోటకు 3, బద్వేల్ నుంచి లంకమలకు 25, బి.మఠానికి 5, మల్లెంకొండకు 12 బస్సులు ఉంటాయన్నారు. పోరుమామిళ్ల నుంచి ఎస్.ఎస్.మఠానికి 3 బస్సులు, మైదుకూరు డిపో నుంచి లంకమలకు 15, జ్యోతికి (సావిశెట్టిపల్లె) 2, పోరుమామిళ్ల నుంచి జ్యోతికి 6, బి.మఠానికి 15, ప్రొద్దుటూరు డిపోనుంచి పొలతలకు 15, యర్రగుంట్ల సంగమేశ్వర ఆలయానికి 4, అల్లాడుపల్లె ఆలయానికి 10, కన్యతీర్థానికి 6, జమ్మలమడుగు డిపో నుంచి అగస్త్యేశ్వరకోనకు 5, కన్యతీర్థానికి 2, శ్రీశైలానికి 2 బస్సులు ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు.

గంగమ్మజాతరకు 50 బస్సులు

మార్చి 1న జరిగే లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరకు కడప డిపో నుంచి 25, పులివెందుల డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్ఎం తెలిపారు. దీంతో పాటుగా మార్చి 14న పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడు రాష్ట్రంలో గల తిరువణ్ణామలై అరుణాచల గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం కడప, ప్రొద్దుటూరు, బద్వేల్, పులివెందుల, మైదుకూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

- జడ్పీ సీఈవో ఓబులమ్మ



ఓవర్‌హెడ్‌ట్యాంకు వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

వల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవికాలంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ అన్నారు. శుక్రవారం వల్లూరు ఎంపీడీవో, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలిసి మండల పరిధిలోని చెరువుకిందపల్లె దగ్గర ఉన్న యోగివేమన సీడబ్ల్యూ స్కీంను సందర్శించారు. అధికారులతో కలిసి అక్కడే సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. రానున్నది వేసవి కాలమని నీటిఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, నీటి సరఫరా నిర్వహణ కోసం ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వారికి సలహాలు, సూచనలు అందించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. అనంతరం పెద్దలేబాక గ్రామంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, పంచాయతీ విస్తరణాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొనారు.

గుర్తింపు కార్డు లేకున్నా రైతు బజారులో టమోటాలు అమ్ముకోవచ్చు

కడప రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులకు పంట ఉండి ఎటువంటి గుర్తింపు కార్డు లేకపోయినా రైతు బజారులో సరుకులు అమ్మకాలు చేయడానికి ప్రభుత్వం అనుమతి కల్పించిందని ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. ప్రస్తుతం టమోటా పంట సీజన్ అయినందున ఎక్కువ సంఖ్యలో సరుకు దిగుబడి రావడంతో గ్రామాలలో తగినంత ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులు తమ దిగుబడులను సరుకును నేరుగా తీసుకొచ్చి రైతు బజారులో అమ్ముకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా సహాయక కేంద్రం ఫోన్ నెంబర్లు 8712644814, 8712644824, రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ సెల్ నెంబర్ 8074723702 సంప్రదించాలన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ కొరడా

- ఎంపీడీవో, ఏవో, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడప రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ అధికారులపై కలెక్టర్ కొరడా ఝుళిపించారు. ఎంపీడీవోతో పాటు ఏవో, సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు.

ఒంటిమిట్ట ఎంపీడీవో కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంఘం నిధులలో రూ.19 లక్షల 17వేలను అడ్డదారుల్లో నొక్కేశారు. ఈ నిధులను 14 విడతలుగా పంచాయతీ కార్యాలయంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఓబులశెట్టి జనార్ధన్ ఖాతాలోకి మళ్లించారు. అక్కడ నుంచి సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ ఆలీబేగ్ అకౌంట్లకు జమచేశారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో విచారణకు కలెక్టర్ ఆదేశించారు. విచారణలో రూ.19.17లక్షలు అడ్డదారుల్లో తినేసినట్లు వెల్లడైంది. ఆ సమయంలో పనిచేసిన అప్పటి రెగ్యులర్ ఎంపీడీవో రెడ్డెయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సోమశేఖర్(ఏవో), ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్ రంగయ్య(ఈవోపీఆర్డీ), సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ ఆలీబేగ్, ఫిట్టర్ తిరుమలశెట్టి జనార్ధన్ ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులుగా పేర్కొని జడ్పీ, డీపీవో శాఖలు నివేదికలను ఈ ఆఫీస్ ద్వారా కలెక్టర్‌కు పంపాయి. దీంతో కలెక్టర్ జడ్పీ శాఖ పరిధిలోని రెడ్డెయ్య (ప్రస్తుతం లక్కిరెడ్డిపల్లె ఎంపీడీవో), సోమశేఖర్ (ప్రస్తుతం ఒంటిమిట్ట మండల ఏవో), వరప్రసాద్ (ప్రస్తుతం ఒంటిమిట్ట మండల సీనియర్ అసిస్టెంట్)లను సస్పెండ్ చేశారు. డీపీవోశాఖ పరిధిలోని వారిని మిగిలిన ముగ్గురిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. ఒంటిమిట్ట మండలంలో పనిచేసిన వారిని ఒకేసారి సస్పెండ్ చేయడంతో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఆశ నిరాశల మామిడి

- పూత ఘనం, పింజ శూన్యం
- పూతను నలిచేస్తున్న తెగుళ్లు
- నిరాశలో మామిడి సాగు రైతులు, వ్యాపారులు



6



మదనపల్లెలో విరబూసిన మామిడి పూత

అన్నమయ్య జిల్లా మామిడి సాగుకు పెట్టింది పేరు. ఇటు జిల్లా ప్రధాన కేంద్రం రాయచోటి మొదలు మదనపల్లె వరకు, అటు రాజంపేట మొదలు రైల్వేకోడూరు వరకు మామిడి తోటలకు ప్రసిద్ధి. సాధారణంగా డిసెంబరు నెల నుంచీ పూత రావాల్సి ఉండగా మదనపల్లెలో జనవరి వరకు పూత రాకపోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. ఎండప్రభావం తోడుకావడంతో ఆలస్యంగా ఫిబ్రవరి చివరిలో వాతావరణ మార్పులు చోటుచేసుకోవడంతో పూత వచ్చింది. దీంతో ఆ ప్రాంత రైతుల్లో ఆనందం చిగుర్చినా ఇదే జిల్లాలోని రాయచోటి ప్రాంతమైన గాలివీడులో ఒక వైపున పూత ఉన్నా మరో వైపు పూత సరిగ్గా రాలేదు. తెగుళ్ల సోకడం, వాతావరణ ప్రభావం, పొగమంచు ఏర్పడడమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు. కాగా ఈఏడాది ఆలస్యంగానైనా వచ్చిన పూత సరిగా లేదు. అంతేకాకుండా వచ్చిన పూత కూడా పింజ దిగకుండా రాలిపోవడంతో రైతుకు కంటిమీదు కునుకు లేదాయె. ఈ విషయంలో అటు రైతులు, ఇటు తోటలను గుత్తకు తీసుకున్న వ్యాపారులు ఆందోళన చెందుతు న్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఉద్యాన అధికారులు రైతులకు సూచనలు చేస్తే మామిడి తోటలు సాగుదారులు కనీసం కొంతవరకైనా ఆదాయం పొందవచ్చని పలువురు రైతులు కోరుతున్నారు. వివరాల్లోకెళితే.....



పందికుంటలో సరిగ్గా రాని పూత

చిగురిస్తున్న ఆశలు

- జిల్లాలో ఇబ్బడిగా మామిడిపూత
- 40 రకాలకు పైగా మామిడి సాగు
- యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయాలి
- పూతను కాపాడుకుంటున్న రైతులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా డిసెంబరు నెలలో మామిడి పూత దశకు వస్తుంది. అప్పటి నుంచే మామిడి రైతులు రకర కాల సతవలు చెట్టుకు ఇస్తూ వస్తుంటారు. అయితే ఈఏడాది అను కోకుండా వచ్చిన తుపాన్‌లు, పొగ మంచు ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని రైతులు భావించారు. అయితే జనవరి వరకు మామిడి పూత కనబడక పోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. ఎండ ప్రభావం తోడు కావడంతో ఆలస్యంగా ఫిబ్రవరి ప్రారంభం కాగానే పరిస్థితులు మార డం, పూత వస్తుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఫిబ్రవరి చివరిలో మామిడి తోటల్లో ఎక్కడ చూసినా పూతతో చెట్లు కళకళలాడుతున్నాయి. అప్పటికే పూతతో పాటు చెట్లల్లో పిందెలు కనబడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 40 వేల హెక్టార్లలో మామిడి సాగు చేస్తుండగా అందులో 40 రకాల మామిడి కాయలు సాగుచేస్తున్నారు. దీంతో రైతులు ఈ ఏడాది పంట బాగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఆలస్యంగా మామిడి పూత

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మామిడి పూత ఈ ఏడాది ఆలస్యంగా కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో మామిడితోపుల్లో ఇబ్బడిముబ్బడిగా పూత కనిపిస్తోంది. మామిడి పంట సాధారణంగా డిసెంబరులో కొద్దిగా జనవరిలో పూర్తి పూత కనపడాల్సి ఉండగా ఈ సారి ఆలస్యంగా ఫిబ్రవరిలో పూత అల్లుకుంది. జిల్లాలోని చాలా మండలాల్లో ఇప్పుడి ప్పుడే పూత వస్తుడడంతో మామిడి రైతులు పంటపై ఆశలు పెట్టుకున్నారు. మరో పక్క మామిడి పూత రాలిపోకుండా నివారించేందుకు క్రిమిసంహారిణి పిచికారీ చేస్తూ పూత రాలకుండా కాపాడుకుంటున్నారు. ఇక యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఈ ఏడాది కూడా మంచి దిగుబడి చేతికి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

జిల్లాలో 40 వేల హెక్టార్లలో మామిడి సాగు

అన్నమయ్య జిల్లాలో సుమారు 40 వేల హెక్టార్లకు పైగా రైతులు మామిడిని సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని పలు ప్రాంతాలైన రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల్లో ఎక్కువగా సాగులో ఉన్నా ఆ తరువాత మదనపల్లె, రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల్లో మామిడి తోటల సాగు పెరుగుతోంది. ఏటా మామిడి సాగు పెరుగుతోంది. రానురాను భవిష్యత్‌లో జిల్లాలో మామిడి సాగుకు ప్రసిద్ధి చెందుతుంది. వివిధ రకాల మామిడి కాయలు సాగు చేస్తూ ఇక్కడ రైతులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి పూత ఆలస్యమైనా మెండుగా రావడంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. కాగా పూత తగ్గట్టుగా దిగుబడి వచ్చిందంటే మామిడిలో ఆశించినంత ఆదాయం వస్తుందని రైతాంగం ఆశిస్తోంది.

నాలుగు నెలలు మామిడి మార్కెట్....

జిల్లాలో పండించిన మామిడి పంటకు ఇతర రాష్ట్రాల్లో కూడా డిమాండ్ ఉంటుంది. ఇక్కడ ఎక్కువగా బేనీషా, నీలం, బెంగళూరు, లాల్‌బహర్, మల్‌గూబ, తోతాపురి, ఇమామ్, పసందు, ఎర్రనీలం, ఇతర అనేక రకాల మామిడి మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా రైల్వేకోడూరు ప్రాంతంలో మామిడి మార్కెట్ కళకళలాడుతుంటోంది. నాలుగు నెలల పాటు సీజన్‌లో మార్కెట్ ఉంటుంది. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచి ముఖ్యంగా రైల్వేకోడూరు మార్కెట్ నుంచి ఢిల్లీ, హరియాణ, చండీఘర్, బెంగళూరు విజయవాడ, హైదరాబాదు, చెన్నై తదితర ప్రాంతాలకు జిల్లా నుంచి నిత్యం రవాణా జరుగుతోంది. వీరబల్లి, సుండుపల్లె ప్రాంతాల్లో పండించిన బేనీషాకు అధికంగా డిమాండ్ ఉంటుంది. ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా ఈ ప్రాంతాల్లో పండిన మామిడిని ఎక్కువగా ఇష్టపడుతుంటారు. జిల్లాలో మామిడి పంట జూలై వరకు వస్తూనే ఉంటుంది.

ఆశ నిరాశల మామిడి

- పూత ఘనం, పింజ శూన్యం
- పూతను నలిచేస్తున్న తెగుళ్లు
- నిరాశలో మామిడి సాగు రైతులు, వ్యాపారులు

గాలివీడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుకు ఈ ఏడాదిపూత దశలోనే కష్టకాలం మొదలైంది. సాధారణంగా డిసెంబరు తొలివారంలోనే పూతతో నిండుగా కనిపించే మామిడితోటలు ఫిబ్రవరి వచ్చినా సగం చెట్లే పూత దశకు చేరుకున్నాయి. గాలివీడు మండలం నూలివీడు, సీసీపల్లె, ఎగువగొట్టివీడు, గోరాన్చెరువు, గోపనపల్లె, పేరంపల్లె, గుండ్లచెరువుతో పాటు అన్ని పంచాయతీల్లో దాదాపుగా మూడు వేల ఎకరాలకు పైన మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో సక్రమంగా వర్షాలు కురవక పోవడం, వాతావరణంలో మార్పుల వలన ఈ సారి పూత ఆలస్యమైందని రైతులు తెలియజేస్తున్నారు. అయితే తేనె మంచు పురుగు, నల్లి తదితర తెగుళ్లతో పూతదశలోనే చాలా వరకు రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ పరిస్థితుల ప్రభావం

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగానే మామిడి పూత, కాపు ఆధారపడిపడి దిగుడిపై ప్రభావం చూపుతోంది. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటే పూత సక్రమంగా రాదు. పూత వచ్చినవి కూడా విచ్చుకోక రాలిపోతోందని రైతులు వివరిస్తున్నారు. ఉష్ణోగ్రతలో పూత ఆలస్యం కావడం, వచ్చిన పూత కూడా సక్రమంగా నిలవక పోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సాధారణంగా పూతను బట్టి లేత, పిందె దశలోనే దిగుబడిపై అంచ నాలు ఉంటా యని, ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడి అంచనాలు ఉంటాయి. అయితే దిగుబడి కూడా చెప్పలేని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీవ్రమైన తెగుళ్లు

పదేళ్ల కిందట మామిడి తోటలకు తెగుళ్లు సోకేవి కావని అప్పుడు ఒక్కసారి కూడా తెగుళ్లకు మందులు పిచికారీ చేసేవాళ్లము కాదని రైతులు అంటున్నారు. కానీ నేడు మామిడి తోటలకు ఎక్కువగా తెగుళ్లు సోకుతున్నాయని అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ప్రతి నెలా మందులను కొట్టినా తెగుళ్ల తగ్గలేదన్నారు. ముఖ్యంగా పొగమంచు కురవడంతో పూతకు ఎక్కువగా తెగుళ్లు సోకుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం మామిడి చెట్లకు, పూతకు పచ్చతెగుళ్లు, మంచు తెగుళ్లు, బూడిద తెగుళ్లు, పక్షికన్ను తెగుళ్లు, తామర పురుగు తెగుళ్లు సోకుతున్నాయని తెలిపారు. ఈ తెగుళ్లు సోకడంతో పూత అంతా పింజ పట్టకుండా రాలిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు లేక పోవడంతో వరి, వేరేశనగ వంటి ఆదాయం వచ్చే పంటలను సాగు చేయలేదని రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాదైనా మామిడి మామిడి తోటలు దిగుబడి ఎక్కువగా ఉంటారని ఆశపడినా ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే పంట అంత ఆశాజనకంగా లేదన్నారు. ప్రస్తుతం మామిడి తోటలకు పూత ఏపుగా రావడానికి,వచ్చిన పూత, పింజగా మారానికి ఇప్పటికే వేలకువేలు ఖర్చు పెట్టి వివిధ రకాల మందులను కొట్టినా పింజ సక్రమంగా పట్టలేదన్నారు. ఇదే పరిస్థితులు కొనసాగితే ఒక్కొక్కరు లక్షల్లో నష్టపోవాల్సి వస్తుందన్నారు.

సబ్సిడీపై ఎరువులు క్రిమిసంహారిణులు ఇవ్వాలి



ఏడాదికి ఒక ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతోంది. ఎకరాకు రెండు టన్నుల దిగుబడి వస్తే ఉన్న రూ.30వేలకు పైబడి ధర పలి కితే పెట్టుబడి మాత్రమే వస్తోంది. అంతకన్నా తక్కువ దిగుబడి వస్తే తీవ్రంగా నష్టపోతాము. కావున ప్రభుత్వం మామిడి సాగురైతులకు కూడా సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు ఇచ్చి ఆదుకోవాలి.

- నక్కల యోగాంజుల్‌రెడ్డి, నూలివీడు

ఈ సారి అన్నీ సమస్యలే



మా కుటుంబం ఐదెకరాల్లో మామిడిని సాగు చేశాము. పూత రాక ముందు నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు మందులను వాడినాము. ఎకరాకు 10 వేలకుపైన మందులను ఖర్చు చేశాము. అయినా పూత సక్రమంగా నిలబడలేదు. వచ్చిన పూత, పింజ దశ నుంచి కాయ దశ వరకు కూడా ఇంకా అనేక సార్లు మందులను వాడాలి, దిగుబడి ఎక్కువగా ఉంటే నష్టాలు రావు. దిగుబడి తక్కువగా ఉంటే తీవ్రంగా నష్టపోతాం.

- సుదర్శన్‌రెడ్డి, పందికుంట, గాలివీడు మండలం

లారీ, టాటాఏసీ ఢీ - డ్రైవర్ మృతి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): లారీ, టాటాఏసర్ ఢీకొనడంతో టాటాఏసర్ డ్రైవర్ మనోహర్ (24) అక్కడికి అక్కడే మృతి చెందాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... ములకలచెరువు మండలం, సోంపాళెం గ్రామం, రాయప్పగారిపల్లె వాసి ఉత్తన్న కుమారుడు మనోహర్ డ్రైవరుగా ఉన్నాడు. పనిలో భాగంగా ములకలచెరువు నుంచి మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌కు లోడుతో గురువారం రాత్రి వచ్చి టమోటాలు దించాడు. శుక్రవారం తెల్లవారు జామున తిరుగు ప్రయాణంలో కురబలకోట సమీప బ్రిడ్జిపై ములకల చెరువు నుంచి చెన్నై వైపు వెళ్లుతున్న లారీ టాటాఏసర్ రెండూ ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ మనోహర్ రెండు వాహనాల మధ్యలో ఇరుక్కుని చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని ఎక్స్‌కవేటర్‌తో వెలికి తీసి శవ పరీక్ష కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బెంగుళూరులో గురుకుల విద్యార్థినుల సందడి



బెంగళూరులో విప్రో అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

కలికిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు బెంగళూరులోని విప్రో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో శుక్రవారం సందడి చేశారు. విప్రో ఎర్తియన్-24 పోటీల్లో పాల్గొన్న ఐదుగురు విద్యార్థినులు జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా మొత్తం 23 పాఠశాలలు జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కాగా అందులో దక్షిణాదిన ఐదు రాష్ట్రాల నుంచి కలికిరి గురుకుల విద్యార్థినులు చోటు దక్కించుకోవడం విశేషం. రెండు రోజులు జరుగుతున్న అవార్డుల ప్రదాన ఉత్సవాల్లో వీరు పాల్గొంటున్నారు. శుక్రవారం ఒక్కో విద్యార్థినిని ఒక్కో రాష్ట్రం విజేతలతో కలిపి ప్రదర్శనలు, వర్క్‌షాపులు నిర్వహించారు. కలికిరి బీసీ గురుకుల పాఠశాలకు చెందిన కె.ఖ్యాతి, జె.రూపిక, టి.భవ్యశ్రీ, ఎం.చందన అగర్వాల్, పి.సుప్రియ జాతీయస్థాయి అవార్డును చేజిక్కించుకున్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అఫ్సానా ఆధ్వర్యంలో వీరు నిర్వహించిన పెప్పెట్రీ (తోలుబొమ్మలాట), ఆర్ట్ గ్యాలరీ, స్టోరీ టెల్లింగ్, విజువల్ ఆర్ట్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. సీపీ రామస్వామి ఎన్విరాన్‌మెంటల్ ఎడుకేషన్ సెంటర్ (సీపీఆర్ ఈఈసీ)కి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ వెంకటరత్నం కలికిరి విద్యార్థినులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. శనివారం విప్రో ఎక్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ, అజీమ్ ప్రేమ్‌జీ, ఫౌండేషన్ సీఈఓ అనురాగ్ బేహర్ విజేతలకు అవార్డుగా రూ.50 వేల నగదు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

'గ్రామ కంఠాన్ని ఆన్‌లైన్ చేశారు'

నందలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సర్వేనంబరు 66/13లో ఎకరా 60 సెంట్లు గ్రామకంఠం స్థలాన్ని కొందరు ఆన్‌లైన్ చేసుకున్నారని కుంపిణీపురం వాసులు ఆరోపించారు. గ్రామస్థులు మాట్లాడుతూ నూకినేనిపల్లె పంచాయతీ సర్వేనంబరు 66/13లో ఒక ఎకరా 60 సెంట్లు గ్రామకంఠం స్థలం ఉందన్నారు. అందులో దాదాపు 20 ఇళ్లు, కొన్ని పాడుబడిన ఇళ్ల ప్రభుత్వ రోడ్, చేతిబోరు ఉన్నాయన్నారు. ఇక్కడే సుమారు 40 ఏళ్లగా వివిధ కులాలవారం జీవిస్తున్నామని, నేడు కొందరు వచ్చి ఆ స్థలం మాది అని మా పేరుతో రిజిస్టర్ అయిందని ఖాళీ చేయాలని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆ స్థలంలోనే కుమ్మరి కుండలు చేసుకుని అమ్ముకునేవారని తెలిపారు. రెవెన్యూ వారిని మోసగించి వారిపేరుతో ఆన్‌లైన్ చేసుకున్నారన్నారు. 2024 డిసెంబరులో ఆ స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్నారన్నారు. ఇప్పుడు వారు దౌర్జన్యంగా తాము నివశిస్తున్న స్థలాల్లో ఎక్స్‌కవేటర్లు పెట్టి చదును చేస్తూ తమను ఖాళీ చేయమని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

పుల్లంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా కొండే నాగిరెడ్డి(43) గురువారం రాత్రి ఉరివేసుకున్నట్లు పుల్లంపేట పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు కేతవాండ్లపల్లె వాసి కొండే నాగిరెడ్డి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. నాలుగు నెలల కిందట యాక్సిడెంట్ జరగడంతో గాయపడి కోలుకున్నాడు. ప్రమాద సమయంలో గుండెపోటు వచ్చిందని, ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు తోడవడంతో ఇంట్లో ఉన్న కొక్కికి లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గిట్టుబాటు ధరలపై చర్యలు

క్రేటుకు రూ.300 ధర కల్పించండి: ఎమ్మెల్యే ● టమోట రైతులతో సబ్‌కలెక్టర్ ముఖాముఖి

నెల్లూరు, కావలి రైతుబజార్లకు మదనపల్లె టమోటా



కాశీరావుపేట వద్ద తోటలో టమోట రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిర్చి ధరలు పడిపోతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో టమోటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కలెక్టర్ సూచనలతో మార్కెటింగ్ అధికారులతో కలసి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులను, మార్కెట్‌యార్డులో వ్యాపారులు, అధికారులతో చర్చించారు. శుక్రవారం మదనపల్లె మండలం కాశీరావుపేట వద్ద టమోట రైతులతో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ లో టమోట ఎంత ధర, ఖర్చు, గిట్టుబాటుపై ప్రశ్నించారు. రైతులు మాట్లాడుతూ కిలో టమోటాకు రూ.12 ధర వస్తే గిట్టుబాటు అవుతుందని, పెట్టుబడి తిరిగి వస్తుందన్నారు. మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, ఏపీ మాస్ ప్రతినిధి మధుసూదన్ రెడ్డితో సబ్‌కలెక్టర్ చర్చించారు. బయట మార్కెట్‌కు రైతుల పొలం నుంచే టమోటా తరలిస్తే ఎలా వుంటుందని, అక్కడి ధరలు, ఇక్కడ ధరలు సరిపోల్చారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఏయే మండలాల్లో టమోట దిగుబడి వస్తుందో అక్కడికి వెళ్లి రైతులతో చర్చించి, వారికి గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామ న్నారు. అనంతరం టమోటా మార్కెట్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలసి రైతులు, వ్యాపారులతో సబ్‌కలెక్టర్ చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కిలో టమో టా కనిష్టంగా రూ.6 నుంచి గరిష్టంగా రూ.10 వరకు ధరలు పలుకుతున్నాయని, దీని వలన రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్నా రు. 25 కిలోల క్రేట్ టమోటా రూ.300 నుంచి రూ.350 ధర కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందన్నారు. మదనపల్లె టమోటా యార్డులో నిత్యం 60 నుంచి 70 మెట్రిక్ టన్నులు టమోట విక్రయానికి వస్తున్నాయని, భవిష్యత్‌లో పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై మార్కెటింగ్ ఏడీఎంతో ఎమ్మెల్యే చర్చించారు. హార్టికల్చర్ అధికారి ఈశ్వర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు, కావలికి మదనపల్లె టమోట

మదనపల్లె టమోట యార్డు నుంచి నెల్లూరు, కావలి రైతుబజార్లకు 10 టన్నుల టమోట ఎగుమతి చేస్తున్నామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ప్రకటించారు. శుక్రవారం మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు ఆధ్వర్యంలో మదనపల్లె టమోట మార్కెట్‌లో రైతుల నుంచి కిలో రూ.8.46 పైసలు చొప్పున టమోటలను కొనుగోలు చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన 10 టన్నుల టమోటను నెల్లూరు, కావలి రైతు బజార్లకు రవాణా చేశారు. ఏడీఎం మాట్లాడుతూ పై రెండు రైతుబజార్లలో ప్రజలకు టమోట కిలో రూ.12 చొప్పున విక్రయిస్తామన్నారు. ధరలు స్థిరీకరణ అయ్యేంత వరకు మదనపల్లెలో టమోటలను కొనుగోలు చేసి రైతుబజార్లకు తరలిస్తామ న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ శివశంకర్, హార్టికల్చర్ అధికారి ఈశ్వరప్రసాద్, యార్డు సెక్రటరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులు నడపాలి

అర్హులకు పదోన్నతులు ఇవ్వాలి ● కారుణ్య నియామకాలు చేపట్టాలి

● పీలేరులో ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

పీలేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో కొత్తగా వస్తున్న విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. పీలేరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం జరిగిన ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణ, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2035 నాటికి డీజిల్ బస్సుల స్థానంలో పూర్తిగా విద్యుత్ బస్సులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. అయితే విద్యుత్ బస్సులను పూర్తిగా ప్రైవేటు సంస్థల ద్వారా నడపకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలన్నారు. తద్వారా ఆర్టీసీలోని సిబ్బందిని కాపాడడమే కాకుండా నిరుద్యోగ సమస్యను తగ్గించవచ్చన్నారు. ఆర్టీసీలో ఇప్పటికే 35 శాతం అద్దె బస్సులు నడుస్తున్నాయని, విద్యుత్ బస్సుల రాకతో ఆ శాతం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేటీకరణ కారణంగా తమ ఉద్యోగాలు ఉండవేమోనన్న ఆందోళనలో ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారన్నారు. ప్రైవేటు ఆపరేటర్ల కారణంగా ఇప్పటికే సంస్థకు చెడ్డ పేరు వస్తోందని, అలా కాకుండా ప్రస్తుతం ఉన్న సిబ్బందికి శిక్షణ ఇచ్చి విద్యుత్ బస్సుల్లో నియమించాలన్నారు. విద్యుత్ బస్సుల కారణంగా ఇప్పటికే తిరుపతిలోని అలిపిరి డిపో పూర్తిగా మూతపడిందన్నారు. రాష్ట్ర విభజన నాటికి ఆర్టీసీలో 62 వేల మంది సిబ్బంది ఉంటే ప్రస్తుతం 47 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, 8 వేల మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారన్నారు. వీరు కాకుండా అద్దె బస్సు డ్రైవర్లు, ఆన్ కాల్ డ్రైవర్లు మరో 20 వేల మంది పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం సంస్థలో ఖాళీగా ఉన్న 12 వేల ఖాళీల్లో అర్హత ఉన్న వారిని పదోన్నతులు కల్పించాలని, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలన్నారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు కూడా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ నేతలు జీఎస్‌మణ్యం, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆనంద బాబు, కార్యదర్శి బీసీ శేఖర్, పీలేరు డిపో అధ్యక్షులు ఏఆర్ చంద్ర, కార్యదర్శి ఖాదర్ బాషా, సీసీఎస్ డెలిగేట్స్ కేవీ రమణ, వేణు, జిల్లా కమిటీ సభ్యులు శోభారాణి, శ్రీనివాసులు, ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హత్యరాల సమీపంలో సింగమల హరిప్రసాద్(32) చెట్టుకు ఉరేసుకున్నాడు. పుల్లంపేట మండలం రామక్కపల్లె హరి జన వాడ వాసిగా పోలీసులు గుర్తించారు. విషయాన్ని తల్లి ఆదెమ్మకు తెలపడంతో కుమారుడు మృతదేహం చూసి ఆమె విలపించింది. తండ్రి నరసింహులు మృతి చెందిన ప్పటి నుంచీ హరిప్రసాద్ మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యంతో బాధపడు తున్నాడని ఆమె తెలిపారు. ఐదు రోజులుగా హరిప్రసాద్ ఇంటి నుంచి వెళ్లిపోయాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వెలుగొచ్చింది



మదనపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఆంధ్రజ్యోతి చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు మున్సిపల్ అధికారులు శుక్రవారం స్పందించారు. మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్ 30వ వార్డులో జనవరి 28న జరిగిన కార్యక్రమంలో ప్రశాంత్ నగర్‌లోని వివిధ లేన్లు, సప్తగిరినగర్ ఏరియాల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదని స్థానికులు ప్రస్తావించారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఇచ్చిన హామీ మేరకు సామగ్రి తెప్పించి పది వీధిలైట్లు ఏర్పాటు చేశారు. మున్సిపల్ డీఈ శ్రావణి, వార్డు అమెనిటీ సెక్రటరీ మానస, స్థానిక టీడీపీ నాయకుడు భాస్కర్ ముందుండి ఏర్పాట్లు చేశారు. ప్రశాంత్ నగర్‌లో ఒకటో లైన్ నుంచి తొమ్మిదో లైన్ వరకు, సప్తగిరినగర్‌లోని వివిధ ఏరియాల్లో మరమ్మతులకు గురైన లైట్లను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో వీధి లైట్లు లేక అంధకారంలో ఉంటున్న స్థానికులు.. వీధిలైట్ల ఏర్పాటుతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కార్య క్రమంలో ఎ.వి.నాయుడు కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద, ట్యాంకు ఆవరణలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాల్వలు శుభ్రం చేయాలని స్థానికులు సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ వారం కిందటే పారిశుధ్య కార్మికుల చేత గ్యాంగ్‌వర్క్స్ చేయించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆంధ్రజ్యోతి ద్వారా వెలుగులోకి వచ్చిన వివిధ సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.



మరమ్మతుల అనంతరం వెలుగుతున్న వీధిలైటు

ప్రశాంత్‌నగర్‌లో విద్యుత్ స్తంభానికి వీధిలైటు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



- సామాన్యులే టార్గెట్గా..
- వడ్డీపై వడ్డీ వేస్తూ వసూళ్లు
- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీసుస్టేషన్లకు చేరుతున్న పేచీలు

జలగల్లా... వడ్డీ వ్యాపారులు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వడ్డీ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. నూటికి 5, 10, 15 వడ్డీలు వసూ లు చేస్తూ సామాన్యులను జలగల్లా పీలుస్తున్నారు. పేద మధ్యతర గతి వారి అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీలు కాజేస్తున్నారు. కొందరు సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని వడ్డీ వ్యాపారాలు చేస్తుండగా మరికొంత మంది ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండా అనధికారికంగా అప్పులు ఇచ్చి వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యం గా ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకుని అప్పులు ఇచ్చి అధిక వడ్డీలు గుంజుతున్నారు. ఇలా అప్పులు తీసుకున్న వారిలో కొందరు గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేశారు. ప్రస్తుతం రియల్ భూం మందగించడంతో అప్పులు తీసుకున్న వ్యక్తులు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఈనేపథ్యంలో ష్యూరిటీ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఆస్తులను వడ్డీవ్యాపా రులు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు, న్యాయబద్ధమైన వడ్డీ చెల్లిస్తామని చెబుతున్నప్ప టికీ వడ్డీ వ్యాపారులు వినిపించుకోవడం లేదు. దీంతో కొన్ని పంచాయితీలు పోలీసు స్టేషన్ వరకు వెళుతున్నాయి. మరికొన్ని వివాదాలకు దారితీస్తున్నాయి.

ఒక్కరోజు ఆలస్యమైనా వడ్డీపై వడ్డీ

నిబంధనలకు లోబడి వడ్డీ వ్యాపారాలు సాగించాల్సిన వ్యాపారులు సామాన్యుడిని పిండేస్తున్నారు. ఒక్కరోజు వడ్డీ చెల్లించడం ఆలస్య మైనా వడ్డీపై వడ్డీ వేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గతంలో ఇలాగే వడ్డీ వ్యాపారులు చెలరేగిపోయిన నేపథ్యంలో హత్యలకు దారితీసిన సంఘటనలు పులివెందులలో చోటుచేసుకున్నాయి. అయి తే కొద్దిరోజులు వ్యాపారులు స్తబ్దుగా ఉండి మళ్లీ వడ్డీ వ్యాపా రం సాగిస్తున్నట్లు సమాచారం. వడ్డీ వ్యాపారులు మార్కెట్లో బహిరం గంగా 10 నుంచి 15 రూపాయలు వడ్డీలకు నగదు అప్పుగా ఇచ్చి.. అసలు కన్నా వేలకు వేలు వడ్డీల రూపంలో వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వడ్డీ వసూళ్లలో నగదు ఇచ్చి వడ్డీ వసూలు చేయడం ఒక పద్ధతి అయితే.. రోజువారీ వడ్డీలు చెల్లించేలా చిరు దుకాణాలకు, షాపుల్లో వర్కర్లకు అప్పులు ఇస్తారు. వీరి నుంచి సాధారణంగా పదివేలు టెండరు రూపంలో అప్పుగా తీసకుంటే పరిమితి గడువులో 13వేలు చెల్లించాలి. ప్రాతిపదికన ఈ వడ్డీని లెక్క కడతారో ఎవరికీ అర్థం కాదు. రూ.200 సంపాదించే కూలీ నుంచి వంద ఈ వడ్డీ వ్యాపారులే కాజేస్తున్నారు. తెలియక అప్పులు తీసుకుని ఇలా ఇరుక్కుపోతున్నామని పలువురు వాపోతున్నారు. ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెబుతున్నారు.


పంచాయితీలకు దారితీస్తూ...

పట్టణ పరిధిలో గత ఐదారు నెలల్లో వడ్డీ వ్యాపారుల పంచాయతీలు భారీ స్థాయిలో జరిగాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద తీసుకున్న రుణాల విషయంలో చివరికి పోలీసుస్టేషన్కు వెళ్లి ఏదోరకంగా పరిష్కారం చేసుకోగా, మరికొన్ని పేచీలతో నడుస్తూనే ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వడ్డీ వ్యాపారులు వేధిసున్న సంఘటనలు వెలుగులోకి రావడంతో విజయవాడలో కాల్మనీ కేసులు పెట్టిన విషయం తెలిసిందే. పులివెందుల ప్రాంతంలో ఈ పేచీలు రోజురోజుకూ పెరుగుతుండడంతో బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏదోరకంగా న్యాయ బద్ధ వడ్డీతో అప్పులు చెల్లిస్తామని చెబుతున్నా ఆస్తులకు విలువలు పెరగడంతో వడ్డీవ్యాపారులు పేచీలు పెడుతుండడంతో సమస్యలు జఠిలమవుతున్నాయి.

ఆన్లైన్ రుణాలతో ఇబ్బందులు

ఇటీవల కాలంలో ఆన్లైన్ రుణాలు తీసుకుని కొందరు యువకులు వారి వత్తిడి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న సంఘటనలు పులివెందులలో వెలుగులోకి వచ్చాయి. ఆన్లైన్లో యువకులను పరిచయం చేసుకుని మాయ మాటలు చెప్పి రుణాలు ఇస్తున్నారు. వారు వసూలు చేసే వడ్డీ చెల్లించలేక యువకులు ఏం చేయాలో పాలుపోక అల్లాడిపోతున్నారు. ఇటీవల పులివెందుల పట్టణంలో చిన్నకొండారెడ్డి కాలనీలో ఓవ్యక్తి ఆన్లైన్ రుణం తీసుకున్నాడు. గడువులోపు చెల్లించ లేకపోవడంతో ఆ యాప్ వారు వేధింపులకు పాల్పడ్డారు. సింహాద్రిపురం మండలం దిద్దకుంట గ్రామా నికి చెందిన ఒక కుటుంబం వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వడ్డీ వ్యాపారులపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిభ వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్



ప్రతిభ చూపిన విద్యార్థికి బహుమతి అందిస్తున్న డీఈవో షంషుద్దీన్

సికెదిన్నె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించడానికే టాలెంట్టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ తెలిపారు. మండలంలోని భారత్ కాలేజీలో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మండలస్థాయి టాలెంట్టెస్ట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడానికి ఇటువంటి టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర శిక్ష అబియాన్ కోఆర్డినేటర్ నిత్యానందరాజు మాట్లాడుతూ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇటువంటి టెస్టులు నిర్వహించడం ద్వారా వారి ప్రతిభ బయటికి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వెంకటరామిరెడ్డి, రమాదేవి, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పొదుపు నైపుణ్యాలు ఆదాయ ప్రగతికి మార్గాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘునాథ్రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ఆర్థిక ప్రణాళిక, పొదుపు నైపుణ్యాలు ఆదాయ ప్రగతికి మార్గాలని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం వైవీయూలో డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 మరియు సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్ఈబీఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ - ఎ వే ఫర్ పర్సనల్ ఫైనాన్షియల్ ఎంపవర్మెంట్ టు స్టాక్ ఇన్వెస్ట్మెంట్స్ అనే అంశంపై వర్క్షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్సెల్ నివేదికతో నెలవారీ బడ్జెట్ను ఎలా తయారు చేయాలో చూపించారు. ఉత్తమ పోర్ట్ఫోలియోలో స్టాక్ పెట్టుబడులలో అవకాశాలు, సవాళ్లను వివరించారు. విశ్లేషణాత్మక నైపుణ్యాలు మరింత అవసరమన్నారు. సంపాదనను పొదుపు వైపు మళ్లించి వివిధ పథకాల్లో పెట్టుబడుల ద్వారా వ్యక్తుల ఆర్థికస్థితి మెరుగై సాధికారత దిశగా వెళ్తారన్నారు. అనంతరం బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, సెబీ ట్రైనర్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించండి : ఆర్డీవో



రైతుల అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు రమాకుమారి

చాపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ తహసీల్దారు రమాకుమారిని ఆదేశించారు. సిద్దారెడ్డిపల్లెలో శుక్రవారం భూ సమస్యలపై సమావేశం జరిగింది. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 13 అర్జీలు రెవెన్యూ గ్రామం నుంచి రాగా 10 పరిష్కారం చేసినట్లు రమాకుమారి తెలిపారు. మిగిలిన మూడు సమస్యలను కూడా పరిష్కారం చేస్తామన్నారు. బెంగుళూరు- అమరావతి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు చెల్లించిన నష్టపరిహారం గురించి ఆర్డీవో తహసీల్దారును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ద్వారకానగరం, సిద్దారెడ్డి గ్రామాలకు కొంతమంది రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు నివేదికలు తయారు చేయాలని ఆర్డీవో ఆదేశించారు. అనంతరం ఆర్డీవో సాయిశ్రీ అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈనెల 26న జరిగే మహాశివరాత్రి ఉత్సవం గురించి ఉత్సవ కమిటీ ఛైర్మన్ వీరనారాయణ అధికారులకు వివరించారు.

నర్సాపురం బీపీఎం అరెస్ట్



అరెస్ట్ చేసిన బీపీఎం నాయక్ను చూపుతున్న పోలీసులు

కాశినాయన ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురం పోస్టాఫీస్లో బీపీఎం (బ్రాంచ్ పోస్టు మాస్టర్) గా పనిచేస్తున్న బుక్కె తిరుపాల్ నాయక్ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బత్తినవాండ్లపల్లి సుగాలి తాండకు చెందిన నాయక్ 14 సంవత్సరాలుగా నర్సాపురంలో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో పలువురి ఖాతాదారుల ఆర్డీలు, ఇతర పొదుపు సొమ్ములను అకౌంట్లో జమచేయకుండా సొంతఅవసరాలకు వాడుకుంటూ వచ్చాడు. విషయం బహిర్గతం కావడంతో విధులకు రాకుండా తప్పించుక తిరుగుతూ వచ్చాడు. ఈ నేపథ్యంలో నున్నా విజయలక్ష్మి అనే మహిళ నర్సాపురం పోలీస్ స్టేషన్లో 2024 సెప్టెంబరు 28న తన ఆర్డీ గడువు తీరగా వచ్చిన డబ్బు, తనకూతురి పేరున కట్టిన సుకన్య సమృద్ధియోజన పథకంలోని రూ2,90,000లను నాయక్ తనకు తెలియకుండా వాడుకున్నాడని ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి 55 మందిని విచారించగా ఇతను ఖాతాదారులకు చెందిన రూ.22,67,469 వాడుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. సదరు బీపీఎం శుక్రవారం ఓబుళాపురం క్రాస్ రోడ్డులో ఉన్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు.

ప్రమాద బాధితులకు సాయం చేస్తూ... యువకుడి మృతి



నరహరినాయుడు మృతదేహం, నరహరినాయుడు (ఫైల్)

ఖాజీపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సాయం చేస్తుండగా విధి వక్రీకరించి ఓ యువకుడు మృత్యువాత పడిన సంఘటన పలువురిని కలిచివేసింది. వివరాల్లోకి వెళితే.. కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కుమ్మరికొట్టాలు వద్ద లారీ ఢీకొనడంతో లగుడుపాటి నరహరినాయుడు (36) మృతి చెందాడు. నలుగురు స్నేహితులు తమ మిత్రుడికి జ్వరం రావడంతో చికిత్స చేయించి మైదుకూరులోని అతని స్వగృహం వద్ద వదిలి పెట్టారు. తిరిగి వెలుతుండగా కుమ్మరికొట్టాలు వద్దకు రాగానే కారు టైరు పగిలి డివైడర్ను ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వెంకట భానుప్రకాష్, నాగూర్నాగరాజు శివలీల కృష్ణ, జ్ఞానసాయికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును పక్కకు తొలగిస్తుండగా.. అదే సమయంలో ఖాజీపేట నుంచి దువ్వూరు వెళుతున్న ఆటో డ్రైవర్ నరహరినాయుడు వారికి సాయం చేసేందుకు వెళ్లాడు. అందరూ కలిసి కారును తొలగిస్తుండగా ఖాజీపేట నుంచి మైదుకూరు వెళుతున్న లారీ ఢీకొట్టడంతో నరహరినాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన వారిని 108 ద్వారా రిమ్స్కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

అదుపు తప్పిన కంటైనర్

- డ్రైవర్, క్లీనర్కు స్వల్ప గాయాలు



గోటూరు బ్రిడ్జి కింద పడిపోయిన కంటైనర్

వల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రహదారిలోని గోటూరు బ్రిడ్జి వద్ద శుక్రవారం తెల్లవారుజామున కంటైనరు అదుపు తప్పి బ్రిడ్జి కిందికి దూసుకుపోవడంతో డ్రైవర్, క్లీనర్కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... మహారాష్ట్ర ట్రాన్స్పోర్టుకు సంబంధించిన లారీ చెన్నై నుంచి బాంబేకు వెళుతుండగా శుక్రవారం తెల్లవారుజామున డ్రైవరు నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి బ్రిడ్జికి కిందకు దూసుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘనాస్థలానికి వెళ్లి గాయపడిన డ్రైవరు, క్లీనరును రిమ్స్ తరలించి కేసు నమోదు చేశారు.

రసాభాసగా బద్వేలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- కమిషనర్, వైసీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం
- కమిషనర్పై మండిపడ్డ ఎమ్మెల్యే సుధ



కమిషనర్పై మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే సుధ, రాజగోపాల్రెడ్డి, దీటుగా సమాధానం ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ వాకమల్ల రాజగోపాల్రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధ హాజరయ్యారు. అజెండాను ప్రారంభించక ముందే మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి ఏకపక్ష ధోరణితో వ్యవహరించడం సరికాదని, వార్డు సమస్యలపై వార్డుల్లో పర్యటించే సమయంలో అక్కడున్న ప్రజా ప్రతినిధులకు, కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా వార్డు సమస్యలపై ఏకపక్షధోర ణిగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఎమ్మెల్యే సుధా, వైసీపీ కౌన్సిలర్లు కమి షనర్పై ధ్వజమెత్తారు. కాగా ప్రతి మునిసిపల్ సమావేశానికి ఎమ్మె ల్యేగా హాజరవుతున్నా అజెండాలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పేర్లు నమోదు చేయక పోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ కూడా ఘాటైన సమాధానాలు ఇస్తూ, సమావేశాన్ని హుందాగా నడపాలన్నారు. ఏమైనా వార్డుల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామంటూ కౌన్సిలర్లపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు కౌన్సిలర్లు సమావేశానికి వచ్చినప్పుడల్లా సమస్యలు విన్నవిస్తున్నామే తప్ప, వాటిని పరిష్క రించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో మీరు కూడా ఇదే ధోరణిలో వ్యవహరించారంటూ టీడీపీ కౌన్సిలర్లు వాదనకు దిగడంతో వాదనలు, ప్రతివాదనలతో మున్సిపల్ సమావేశం దద్దరిల్లిపోయింది. మున్సిపల్ వైస్ ఛైర్మన్ గోపాలస్వామి నాలా చట్ట ప్రకారం మున్సిపాలిటీలో ఎన్ని ఇళ్లకు అనుమతులు ఇచ్చారో సమాచారం ఇవ్వాలని అర్జీలు ఇచ్చినా, ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. దీంతో కోర్టులో ఉన్న సమస్యలపై ఇక్కడ మాట్లాడకూ డదంటూ మున్సిపల్ కమిషనర్ చెప్పడంతో వీరి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి సమ స్యను తలెత్తకుండా నీటిని సరఫరా చేయాలని కొందరు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జాతీయ రహదారిలో సెంట్రల్ లైటింగ్కు ప్లెక్సీలు పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వాటిని తొలగించి అనుమతులు ఉన్నవాటికి ప్లెక్సీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వార్డుల్లో నెలకొన్న సమస్యలు సమావేశం దృష్టికి తీసుకు రావడంతో వాటన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తామన్నారు.

బుల్లెట్ అదుపు తప్పి యువకుడి మృతి



సుమంత్ మృతదేహం

సికెదిన్నె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ మోటారు సైకిల్ అదుపు తప్పి కింద పడటంతో సుమంత్ అనే యువకుడు మృతి చెందినట్లు సీఐ శివశంకర్నాయక్ తెలిపారు. నంద్యాల జిల్లా పున్నాపురంలో నివాసం ఉంటున్న కొండపల్లి సుమంత్ తన స్నేహితులతో కలిసి నంద్యాల నుంచి శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో తిరుమల దర్శనానికి బుల్లెట్ వాహనంలో బయలుదేరారు. తెల్లవారుజామున అయిదు గంటలకు కడప జయరాజ్ గార్డెన్స్ సమీపంలోకి రాగానే స్పీడ్బేకర్ వద్ద బుల్లెట్ వాహనం అదుపు తప్పడంతో ఎగిరి కిందపడ్డారు. దీంతో అతనితో పాటు ప్రశాంత్, శివకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్కు తరలించగా.. సుమంత్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- పట్టుబడ్డ వాహనాలకు రూ.2.85 లక్షలు జరిమానా

దువ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీప గుట్ట ప్రాంతంలో అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న 10 టిప్పర్లు, నాలుగు ఎక్స్కవేటర్లకు మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ సూర్యచంద్ర జరిమానా విధించినట్లు తహసీల్దారు అక్బర్బాష తెలిపారు. ఈనెల 18వ తేదీ కూటమి సర్కార్లోనూ కొల్లగొడుతున్నారు అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయిన విషయం విధితమే. ఇందుకు స్పందించిన రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడులు చేసి వాహనాలను సీజ్ చేశారు. అనంతరం పట్టుబడ్డ 10 టిప్పర్లకు రూ.85 వేలు, నాలుగు ఎక్స్కవేటర్లకు రూ.2 లక్షలు మొత్తం రూ.2.85 లక్షలు జరిమానా విధించినట్లు తహసీల్దారు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీకేదిన్నె సీఐ శివశంకర్నాయక్ వివరాల మేరకు.. కడప-రాయచోటి జాతీయ రహదారిలో ఊటుకూరు రింగ్రోడ్డు వద్ద స్కూటర్ను కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటర్పై వెళుతున్న వెంకటేశ్వరరెడ్డి గాయపడడంతో చికిత్స నిమిత్తం రిమ్స్కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యథేచ్ఛగా... ఇసుక అక్రమ రవాణా

- నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తున్న ఇసుక మాఫియా
- కానరాని వీఆర్వోల టాస్క్ఫోర్స్



రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ట్రాక్టర్లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. జనవరి 25న ఆంధ్రజ్యోతిలో వచ్చిన ఇసుకాసురుల విధ్వంసం కథనంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించారు. స్వయంగా తహసీల్దారు గంగయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునలు పెన్నానదిలో ప్రొహిబిటెడ్ ఏరియాలో ఇసుక తవ్వకాలపై దాడులు జరిపారు. రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పలు ట్రాక్టర్లకు ఫొటోలు తీశారు. అదేరోజు ప్రొద్దుటూరు పట్టణంలో ఎర్రగుంట్ల రోడ్డులోని బ్రిడ్జి దగ్గర నుంచి రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్సు దగ్గర రైల్వే వంతెన ఎగువ వరకు పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపరాదని... ఆప్రాంతం అంతా ప్రొహిబిటెడ్ ఏరియా కిందకు వస్తుందని తహసీల్దారు స్వయంగా విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ప్రొద్దుటూరు పరిధిలో పెన్నానదిలో ఇసుక తవ్వకాలపై నిషేదాజ్ఞలు పెట్టిన ప్రాంతంలోనే ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. రామేశ్వరం హెడ్ వాటర్వర్క్సు నుంచి ఆర్టీసీపీ రోడ్డు మార్గాన ఇసుక ట్రాక్టర్లు కనపడితే సీజ్ చేయమని తహసీల్దారు ఆదేశాలు ఇచ్చినా.. యథేచ్ఛగా వాటర్ వర్క్సు ప్రాంతం, రైల్వే వంతెన వద్ద నుంచి ఇసుకను తరలిస్తున్నారు. పెన్నానదిలో అనుమతిలేని ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తర లించకుండా కట్టడి చేయడానికి వీఆర్వోలతో ఫిబ్రవరి 12న టాస్క్ ఫోర్స్టీంను తహసీల్దారు గంగయ్య నియమించారు. ఇందులో అమర్నాథ్రెడ్డి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అక్కడ పర్యవేక్షించాలి. అలాగే బిల్లాల బాషా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మల్లికార్జున మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు, కె.వెంకట బ్రహ్మయ్య సాయం త్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు, వెంకట ప్రేమ్ సాయి రాత్రి 7గంటల నుంచి పర్యవేక్షించాలని తహసీల్దారు ఉత్తర్వులు ఇచ్చారు. కానీ పెన్నానది ప్రొహిబిటెడ్ ఏరియాలో వీళ్లు కానరావడం లేదు. దీంతో ఇసుకను తవ్వకాలు జరిపి పట్టపగలే తరలించుకు పోతున్నారు. కాగా, తహసీల్దారు గంగయ్య ప్రొద్దుటూరులో ఇళ్ల కట్టడాలకు ఇసుక కావాల్సిన వాళ్లు ప్రభుత్వం అనుమతిచ్చిన కల్లూ రు, నంగనూరుపల్లె, చౌడూరు రీచ్ల వద్దకు వెళ్లి మాత్రమే ఇసుకను తీసుకువెళ్లాలని తెలిపినా.. ఇసుక మాఫియా తహసీల్దారు ఆదేశా లను ఖాతరు చేయడం లేదు. కాగా, పెన్నా నదిలో అనుమతి లేని ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

అవి.. ఇవి.. అన్నీ

మోడల్ స్కూలు ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూలులో 2025-26కు గాను 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు లిల్లెమ్మ, విజయారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకుని ఒక సెట్ దరఖాస్తును స్థానిక మోడల్ స్కూల్లో అందించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ మార్చి 20 అన్నారు. ప్రవేశ పరీక్ష తేదీ మార్చి 24 ఉంటుందన్నారు. దరఖాస్తుకు సంబంధించి కొంత మేర ఫీజు కట్టాల్సి వస్తుందన్నారు. పూర్తి వివరాలకు గంగాయపల్లెలోని మాడల్ స్కూలులోని ప్రిన్సిపాల్, అధికారులతో మాట్లాడాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ సభా భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు అందరూ తప్పక హాజరు కావాలన్నారు.

నేడు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈనెల 22వ తేదీ శనివారం సాయంత్రం 5గంటలకు ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్న డీఈఓ షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రతి ఉపాధ్యాయ సంఘం నుంచి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి హాజరుకావాలని కోరారు.

బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు

కడప రూరల్, ఫిబ్రవరి 21 : బుగ్గమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 26న మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థానం కమిటీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 26న కల్యాణం, సేద్యపు ఎద్దులచే బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ప్రథమ బహుమతి రూ.40000, రెండవ బహుమతి రూ.30000, మూడవ బహుమతి రూ.20000, నాలుగో బహుమతి రూ.15000, ఐదవ బహుమతి రూ.10000 ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలలో అందరూ పాల్గొని శివపార్వతుల కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

మాతృభాషా వికాసం కోసమే తెలుగు సాహితీయాత్రలు

కడప కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, మాతృభాష వికాసం కోసమే తెలుగు సాహితీ యాత్రలు, మొల్ల జయంతి ఉత్సవాలు ప్రారంభించినట్లు సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది. సాహితీయాత్రను గానుగపెంట ప్రారంభించి మాట్లాడారు. మాతృభాష వారసత్వాన్ని సంరక్షించడం ద్వారా విద్యాప్రగతిని సాధించవచ్చన్నారు. కేస్కో అధ్యక్షుడే అలపర్తి పిచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న ఏపీఈఆర్‌సీ మెంబర్

చక్రాయపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామిని శుక్రవారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఫైనాన్స్ మెంబర్ వెంకటరామిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు కేసరి, ఉపప్రధాన అర్చకుడు రాజారమేష్‌లు ఘనంగా పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శివదినేష్ తెలిపారు. మరమ్మత్తు పనులు ఉన్న కారణంగా 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈ సందర్భంగా ఏఈ వివరించారు.

నవోదయంతో నాటుసారా నిర్మూలనకు చర్యలు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నవోదయం కార్యక్రమంతో నాటుసారా నిర్మూలనకు చర్యలు చేపడుతున్నట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, తహసీల్దారు నజీర్ అహ్మద్, సీఐ నరసింహులు అన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు.

అసభ్యకర పోస్టులపై జనసేన ఫిర్యాదు

కడప క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న పలు సోషల్ మీడియా అకౌంట్లపై జనసేన పార్టీ ఎన్నికల ప్రోగ్రాం కమిటీ రాయలసీమ కో కన్వీనరు పంద్ర రంజిత్‌కుమార్ శుక్రవారం కడప తాలుకా పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోటోలను మార్ఫింగ్ చేసి ఆయన కుటుంబ సభ్యులను అవమానపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం దారుణమన్నారు. ఈ మేరకు తాలుకా ఎస్ఐ తాహిర్ హుసేన్ ఫిర్యాదును నమోదు చేశారు.

బుడ్డశనగ రైతు ఆశలు ఆవిరి

- వెంటాడిన తుఫాన్లు ముంచిన పొగమంచు
- గిట్టుబాటు కాని ధర
- పెరిగిన పెట్టుబడులు,
- భారీగా తగ్గిన దిగుబడులు

బుడ్డశనగ రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పెరిగిన పంట పెట్టుబడులు.. అనుకూలించని వాతావరణం.. గిట్టుబాటు కాని ధరతో రైతు నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. దుక్కి, విత్తనం, సాగు, ఎరువులు, సస్యరక్షణ, నూర్పిడి దాకా ఖర్చు భారీగా వస్తోందని, అందుకు తగ్గ ధరలు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమలాపురం వ్యవసాయ డివిజన్‌లో బుడ్డశనగ పరిస్థితి ఇదీ...



పంట నూర్పిడి చేసిన శనగ పొలం... బుడ్డశనగలు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కోటి ఆశలతో రబీ సీజన్‌లో బుడ్డశనగ సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. సాగు ఆరంభం నుంచి వరుస కష్టాలు వెంటాడాయి. విత్తనానికి ముందు వర్షాభావం, పైరు వివిధ దశల్లో తెగుళ్ల, పంట చేతికందే తరుణంలో తుఫాన్లు, పొగమంచు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో 4,16,564 హెక్టార్లలో బుడ్డశనగ సాగు చేశారు. అత్యధికంగా కమలాపురం మండలం లో 4952, ఎర్రగుంట్ల మండలంలో సుమారు 4737, వీఎన్‌పల్లె 4608, వల్లూరు మంలంలో 2333 హెక్టార్లలో ఈ పంట సాగు చేశారు. ప్రస్తుతం రైతులు కోత, నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు వస్తాయనుకుంటే 5 క్వింటాళ్ల లోపు దిగుబడి వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్లు, పొగమంచు, తెగుళ్ల దిగుబడులపై ప్రభావం చూపాయి. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులకు తోడు నూర్పిడికి ఎకరాకు రూ.2వేల నుంచి రూ.2500 అదనంగా వెచ్చించాల్సి రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనానికి ముందు ఎర్రశనగలు క్వింటా రూ.7500 గిట్టుబాటు ధర ఉండగా ప్రస్తుతం ఆ ధర లేదు.

దిగుబడులు అంతంత మాత్రమే



ఈ ఏడాది సొంత పొలంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని బుడ్డశనగ సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, తదితర పెట్టుబడులకు ఎకరాకు రూ.20వేలు వెచ్చించాను. తుఫాను, తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. ఎకరాకు 5 క్వింటాళ్లకు మించి రావడంలేదు.

- భాస్కర్‌రెడ్డి, రైతు, చదిపిరాళ్ల గ్రామం

విద్యార్థినులకు చలికోట్లు పంపిణీ



దాతలు పంపిణీ చేసిన చలికోట్లతో విద్యార్థినులు

సింహాద్రిపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) సింహాద్రిపురం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు పోరుమామిళ్లలోని చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్‌నీడ్ సహకారంతో శుక్రవారం చలికోట్లు వితరణ చేశారు. పాఠశాలలోని 242 మంది బాలికలకు సంస్థ వ్యవస్థాపకుడు చిత్తా తోమస్‌రెడ్డి, డాక్టర్ గీతా దంపతులు, సంస్థ ప్రతినిధి ప్రసాదురెడ్డి చేతుల మీదుగా చలికోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గురుదేవి, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొని సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్ 2 రోస్టర్ విధానాన్ని సరిచేయాలి: డీవైఎఫ్ఐ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలలో రోస్టర్ విధానాన్ని సరిచేయాలని డీఐఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్ఐ, ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత రెండు వారాల నుంచి నిరుద్యోగులు మానసిక వేదనతో సతమతమవుతున్నారన్నారు. ఐదేళ్ల తర్వాత వచ్చిన నోటిఫికేషన్ కావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని గతంలోని ఈ ప్రభుత్వం అంగీకరించిందని, ఇపుడు ఎందుకు స్పందించడం లేదని విమర్శించారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, నగర సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దళితులు సాగుచేసిన భూములు దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వారిపై కేసు లు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సమైక్యనగర్ దళితులతో తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

'తెలుగు మాధ్యమాన్ని రద్దుచేయడం చారిత్రక తప్పిదం'

వేంపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో తెలుగుమాధ్యమాన్ని రద్దుచేయడం చారిత్రాత్మక తప్పిదమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించుకొని వేంపల్లెలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న తెలుగు అధ్యాపకులు, ఉపాధ్యాయులు బ్రహ్మానందయ్య, వెంకటరమణ, ధర్మారెడ్డి, కృష్ణవేణి, పద్మజలను శుక్రవారం శాలువలతో తులసిరెడ్డి,కాంగ్రెస్ నేతలుసత్కరించారు. ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలని విద్యాహక్కు చట్టం చెబుతోందని, ఆ ప్రకారం విద్యాబోధన ఉంటే పిల్లలు చక్కగా విద్యనేర్చుకుంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ పెంచాలి

- బ్యాంకు లింకేజీ లేకుండా కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి
- ఏపీ దళితమిత్ర సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు



మాట్లాడుతున్న కైపు రామాంజనేయులు

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో 2025-26కు సంబంధించి ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ పెంచాలని ఏపీ దళితమిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో బడ్జెట్ సమావేశాలపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకుతో లింకు లేకుండా కార్పొరేషన్‌ల ద్వారా 85 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని కోరారు. భూమి లేని దళిత నిరుపేదలకు కుటుంబానికి మూడు ఎకరాల మాగాణి, అభివృద్ధికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. మహాజన రాజ్యం పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు సంగటి మనోహర్ మాట్లాడుతూ దళితులు సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదన్నారు. చేతివృత్తుల ఐక్యవేదిక జాతీయ నాయకుడు అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా ఎదిగినప్పడే కులవివక్షత తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్ఏ సత్తార్, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపకుడు సంగటి మనోహర్, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సగిలి గురప్ప, హ్యూమన్ రైట్స్ కన్వీనరు జేవీ రమణ, సీపీఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు బందెల ఓబయ్య, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు పుల్లయ్య, మాలమహానాడు రాష్ట్ర నాయకుడు వినోద్, హైకోర్టు న్యాయవాది అమీన్‌పీర్, ఏపీ దళిత సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె యల్లయ్య, ఏపీ దళితమిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు కైపు బాబు, ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు చెప్పిన పద్ధతిలో చదువుకోవాలి : సీఐ



కస్తూర్బా గాంధీ పాఠశాలలో
విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ

వల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పద్ధతిలో చదువుకోవాలని సీఐ రోషన్ సూచించారు. శుక్రవారం గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూలులో ఉన్న జూనియర్ కళాశాల, కస్తూర్బా బాలికల పాఠశాల, బాలికల హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ముఖ్యంగా గురువులు చెప్పిన బోధనా రీతిలో చదువుకోవాలని, అప్పుడే లక్ష్య సాధన సాధ్యమని తెలిపారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరంచారు. ఎవరికైనా ఆకతాయిల వల్ల ఇబ్బందులు కలిగితే పోలీసు శాఖకు తెలపాలన్నారు. అనంతరం విద్యార్థుల వసతిగది, వంటశాల, హాస్టలు గదులను సందర్శించారు. విద్యార్థుల వద్ద వసతులు గురించి ప్రత్యేక అధికారితో సమావేశమయ్యారు. ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో అవినీతి కంపు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోత): కడప నగరపాలక సంస్థ అవినీతి కంపుకొడుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ధ్వజ మెత్తారు. దీంతోనే వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చారన్నారు. శుక్రవారం కడప నగరం ద్వారకానగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేయర్, ఆయన భార్య, కొడుకు కాంట్రాక్టర్లని, వారు చేసిన వాటిని ఆమోదింపచేసుకొని, చెక్కులు ఇస్తారన్నారు. వర్ధిని కన్‌స్ట్రక్షన్స్‌ను ఆయన మేయర్ అయిన తర్వాత రిజస్టర్ చేయించుకున్నారన్నారు. కార్పొరేషన్‌లో అధికార దుర్వినియోగం జరిగిందని, స్టాండింగ్ కమిటీకి ఎక్కడా లేని అధికారం ఉందని, మున్సిపల్ నిబంధనలు అతిక్రమించి పనులు చేసుకున్నారన్నారు. కడపను సుందరంగా తీర్చిదిద్దుతామని ఇండియన్ టొబాకో సంస్థ (ఐటీసీ) ముందుకొచ్చి దత్తకు తీసుకుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చెన్నూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళంపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏపీ 39 డీఎల్ 8523 నంబరుగల ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు. గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని ఆవుల రవిశంకర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వారు వివరించారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



మాట్లాడుతున్న అంజద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నాయకులు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చిన అండగా ఉంటామని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం తన కార్యాలయంలో నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, నగర అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. వైసీపీ కోసం ప్రతి ఒక్కరూ కృషిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఈ సందర్భంగా అంజద్‌బాషా పిలుపునిచ్చారు.

'నీ వార్డుకు రాజీనామా చేయి గెలిచి చూపిస్తాం'

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : 'మున్సిపాలిటీలో ఖాళీ ఉన్న 23వ వార్డుకు పోటీ చేసి గెలవండి చూద్దాం' అనే మున్సిపల్ ఛైర్మన్ సవాల్‌కు టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ మహబూబ్‌బాషా స్పందించారు. 23వ వార్డు కాదు, నీ వార్డుకు రాజీనామా చేసి వస్తే నీకు నేను పోటీ నిలబడి గెలిచి చూపిస్తాం అని ప్రతి సవాల్ విసిరారు.

తాను ఓడిపోతే తనతోపాటు బీటెక్ రవి కూడా రాజకీయ సన్యాసం తీసుకుంటామన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉలిమెళ్ల బాబురెడ్డి, ఖాసింవల్లి, మునెయ్య తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Kadapa-I branch issues the following notice to the general public. My client intend to grant loan to **Smt. Timmapuram Mercy Glory** D/o **T. Mariyadas** R/o D.no: 36/344-1, Chinna Chwok, Ashok Nagar, Kadapa City YSR Kadapa dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the ragard. **SCHEDULE OF THE PROPERTY** : Residential Vacant land situated in Kadapa District, Kadapa Urban Sub District, Kadapa Municipal Corporation area, 8th ward of Chinna Chowk, Corporation Ward No., 43, Prakash Nagar, Chinnachowk Village fields, Plot No.682, Circer Punji 898/3, 907/1, 242 sq. yards or Ac. 0.05 cents **BOUNDARIES** : EAST : land of Y. Prabhakar, WEST: House bearing D.No. 43/116-8, NORTH: Road, SOUTH: Land of Saiasu

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆందోళన



నిరసన తెలియజేస్తున్న
ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

కడపసెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శుక్రవారం కడపలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మస్టర్ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుపరిచి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్‌లో ఎన్‌క్యాష్‌మెంట్ మరియు మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలన్నారు. వేతనాలు రూ.26వేలు పెంచాలన్నారు. ఈ మేరకు ఈనెల 24వ తేదీ నగరపాలక సంస్థ, మార్చి 3న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన ధర్నాలు నిర్వహించి మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు.

ముగిసిన డేటా ఎంట్రీ శిక్షణ



మాట్లాడుతున్న పీడీ ఆనందనాయక్

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): లోకోస్ ఆప్ నందు డేటా ఎంట్రీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిశాయి. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాలు నర్వహించారు. ముగింపు సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్ హాజరై శిక్షణార్థులను ఉద్దేశించి మాట్లాడారు.మహిళా సంఘాలు, మండల సమాఖ్య ఆర్థిక లావాదేవీలను దేశం మొత్త మీద ఒకే యాప్‌లో డేటాఎంట్రీ చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు డేటా ఎంట్రీ ద్వారా స్పష్టమైనసమాచారాన్ని పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐబీ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠారెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ రమేష్, శేషు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మహాదేవుని శోభాయాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న విజయానంద్‌రెడ్డి

కడప కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ పుణ్యక్షేత్ర త్రివేణి సంగమంలో మహాకుంభమేళా జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 23వ తేదీ నగరంలో మహాదేవుని శోభాయాత్ర సాగుతుందని శోభాయాత్ర కన్వీనర్ విజయానందరెడ్డి తెలిపారు. శుక్రవారం మృత్యుంజయకుంట శివాలయం వద్ద ఆయన జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు పిడతల గోపాలకృష్ణశర్మ, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ, గౌరవాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, మృత్యుంజయకుంట శివాలయం ప్రధాన అర్చకులు సుధీర్ శశిధర్‌శర్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నగరంలోని అర్చకపురోహితులందరితో కలిసి ఆ కుంభమేళా జలాలను నగరంలో భక్తులపై సంప్రోక్షిస్తూ యాత్ర సాగుతుందన్నారు. నగరంలోని వై.జంక్షన్, అంబేడ్కర్ సర్కిల్, రాజీవ్‌మార్గ్ సర్కిల్, యర్రముక్కపల్లె సర్కిల్, సంధ్య సర్కిల్, ఐటీఐ సర్కిల్, గాగితాలపెంట, కోటిరెడ్డి సర్కిల్, నాగరాజుపేట పాతబస్టాండ్, 7రోడ్లు, 1 టౌన్ సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, కృష్ణసర్కిల్, అన్నమయ్య సర్కిల్, అప్సర, వెంకటేశ్వరస్వామి గుడి మీదుగా తిరిగి మృత్యుంజయకుంట శివాలయానికి చేరుకుంటుందన్నారు.

కుంభమేళా నిర్వహణ హర్షణీయం

కుంభమేళా నిర్వహణ హర్షణీయమని అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విజయ్ భట్టర్ పేర్కొన్నారు. శుక్రవారం బ్రాహ్మణవీధిలో గల జిల్లా అర్చక సమైక్య కార్యాలయంలో జరిగిన బ్రాహ్మణ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో దేవదాయ శాఖ చట్టం 1098/30లోని సెక్షన్-86లో పేర్కొన్నగా శిక్షలు అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో అర్చక సమాక్య గౌరవాధ్యక్షుడు శివసత్యకుమార్‌శర్మ, ఉపాధ్యక్షుడు ఇంద్రగంటి ప్రభాకర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి మురళి జగన్నాధశర్మ, దేవుని కడప ఆలయ అర్చకులు మండాది ప్రదీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిని సుధీర్‌రెడ్డి విమర్శించడం తగదు

● కూటమి నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న గోనా పురుషోత్తంరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిపై జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని జమ్మలమడుగు కూటమి నాయకుడు గోనా పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేయని పాపాలు లేవన్నారు. అందుకే ఆయనను ప్రజలు చెల్లకుండా ఇంటికి పంపారన్నారు. ఇప్పటికైనా దేవగుడి కుటుంబంపై విమర్శలు చేయకుండా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. జమ్మలమడుగులో 8 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం సహకారంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో సుధీర్‌రెడ్డి దేవగుడి సోదరులపై వ్యక్తిగతంగా విమర్శలు చేయడంతోనే ఆదినారాయణరెడ్డి స్పందించారని ఇప్పటికైనా ఆయన భాష మార్చుకోవాలన్నారు. అనంతరం సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రామసుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి కలుసుకుని సుధీర్‌రెడ్డిని మోసం చేసినట్లు ఆరోపించడం తగదన్నారు. రామసుబ్బారెడ్డి గట్టిగా చేయబట్టే పెద్దముడియం మండలంలో సుధీర్‌రెడ్డికి ఎక్కువగా ఓట్లు వచ్చాయనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బానా శివరామలింగారెడ్డి, ఓబుళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



ముద్దనూరు ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు టౌన్ ప్రధాన రోడ్డు విస్తరణకు నేషనల్ హైవే అధికారులు శ్రీకారం చుట్టారు. ఈనెల 4వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో పేరుకే మేజర్ పంచాయతీ.. అభివృద్ధి శూన్యం,పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అను వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. పులివెందుల రోడ్డులోని పుల్లేరు వంక సమీపం నుంచి టౌన్ మీదుగా జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్లు అంజనేయస్వామి గుడి వరకు రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. అందులో భాగంగా ముందుగా టౌన్‌లో రోడ్డు ప్రక్కనున్న చెట్లను తొలగిస్తున్నారు. పుల్లేరు వంక వద్ద విస్తరణ పనులు చేపట్టారు.

కొళాయి కనెక్షన్లు క్రమబద్ధీకరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీల వాసులు

బద్వేలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పేదల కాలనీలు అయిన సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతిబసు కాలనీలలో వీధి దీపాల మరమ్మతులు చేపట్టడంతో పాటు ఆయా కాలనీవాసులకు రూ.200లకే కొళాయి కనెక్షన్లు క్రమబద్ధీకరించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.అలాగే ఆయా కాలనీల్లో వీధి దీపాల మరమ్మతులు చేపట్టి, విద్యుత్ మీటర్లకు ఎన్‌ఓసీలు మంజూరు చేయాలని తదితర డిమాండ్లు చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బందితో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ సభ్యులు చిన్నిమస్తాన్, ఖైరున్‌బీ, రాయప్ప, సుబ్బరాయుడు, ఓబయ్య, వెంకటరత్నమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం టూటౌన్‌బైపాస్ రోడ్డులోని కేబీఎన్‌ఆర్ అప్రూవల్ లేఅవుట్‌లో మున్సిపాలిటీకి వదిలిన ఓపెన్ స్థలాన్ని కొందరు తాత్కాలిక కట్టడాలు నిర్మించారు. ఈ విషయం పై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు అందిన ఫిర్యాదుల మేరకు ఆయన ఆదేశాలతో శుక్రవారం ఉదయం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చంద్రమోహన్ ఆధ్వర్వంలో అక్రమ కట్టడాల తొలగింపు పనులు ఎక్స్‌వేటర్ తో చేపట్టారు. ఈ తొలగింపు పనుల్లో వార్డు ప్లానింగ్ సెక్రటరీలు తదితరు పాల్గొన్నారు.

ఇటుక...ఇక్కట్లు..!



ఇటుకల బట్టీని పేరుస్తున్న కూలీలు (ఫైల్)

- ●తగ్గిన తయారీ
- ●గిరాకీ లేక వ్యాపారం చేయలేమంటున్న తయారీదారులు
- ●200 కుటుంబాలకు పైగా ఉపాధి కోల్పోయిన కూలీలు
- ●పెట్టుబడులూ అధికమయ్యాయంటున్న యజమానులు

గిరాకీ లేక వ్యాపారం చేయలేమని ఇటుకల బట్టీల యజమానులు చేతులెత్తేస్తున్నారు. అంతేగాక మూలిగేనక్కపై తాటికాయ పడిన చందంగా బట్టీలు పెట్టేందుకు అవసరమైన పెట్టుబడులు కూడా అధికమయ్యాయని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల రేట్లు, ఇటుక తయారీకి అవసరమైన ముడి పదార్థాలు అన్నింటి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని యజమానులు వాపోతున్నారు. ఫలితంగా ఇటుక నేను కాలనంటోంది.దీంతో ఇటుకల తయారీ చాలా వరకు తగ్గిందని చెప్పవచ్చు. బట్టీలు కాల్చనందున మండలంలో వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న దాదాపు 200 కుటుంబాలు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డాయి.

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఎక్కువగా ఎర్ర ఇటుకలనే ఉపయోగిస్తారు. ఈ ఎర్రమట్టి ద్వారా తయారైన ఇటుకలను బట్టీలుగా పేర్చి కాల్చడం వల్ల ఎక్కువగా గట్టిదనం ఉంటుందని, భావించి తరతరాలుగా ఇటుకలనే ఉపయోగించేవారు. రాను రాను పెట్టుబడులు అధికం కావడం, గిరాకీ లేకపోవడంతో ఇటుకల బట్టీల యజమానులు కూడా గతంలో వేసిన వాటిని అమ్ముకుంటే చాలు తరువాత చూద్దాం అన్న భావనలో ఉన్నారు. దీంతో ఈ ఏడాది ఇటుకబట్టీలు వేసేవారు చాలా వరకు తగ్గారు. గత ఏడాది దాదాపు 20 మంది బట్టీల యజమానులు దాదాపు కోటి ఇటుకలకు పైగా తయారు చేయించారు. గతంలో 2వేలు ఇటుక రూ.18వేలకు అమ్మకాలు జరిపేవారు. కానీ గృహ నిర్మాణాలు చేసేవారు తగ్గిపోవడంతో ఇటుకల గిరాకీ కూడా తగ్గిపోవడంతో ప్రస్తుతం వాటి ధర 11వేలకు పడిపోయింది. దీంతో ఇటుక బట్టీలు వేసేవారు కూడా తగ్గుముఖం పట్టారు. గతంలో ఇటుకలు తయారు చేసేందుకు నెల్లూరు, కలువాయి, పొదిలి ప్రాంతాల నుంచి దాదాపు వంద కుటుంబాలకు పైగా పోరుమామిళ్ల ప్రాంతానికి వచ్చేవారు. అంతేకాక పచ్చిఇటుకలు వేసిన తరువాత ఇటుక బట్టీలను పేర్చేందుకు పోరుమామిళ్ల ప్రాంతవాసులకు కూడా ఉపాధి దొరికేది. ఇటుకల బట్టి పేర్చేందుకే దాదాపు 500 మందికి పైగా కూలీలకు ఉపాధి లభించేది. ఇటుకలు లక్ష తయారీకి దాదాపు 80 ట్రాక్టర్ల మట్టి, 20 టన్నుల బొగ్గుతో పాటు కర్రలు కూడా అవసరం అవుతాయి. ఇటుకలు వేసి తరువాత వాటిని శుద్ధి చేసి బట్టీలుగా ఏర్పరచి కాల్చిన వారం వరకు బట్టీలకు కాపలా ఉండాల్సి ఉంటుంది. కూలీ రేట్లు కూడా పెరగడం, పెట్టుబడులకు అప్పులు తెచ్చి పెట్టి అసలు కూడా రాకపోవడంతో చాలా మంది ఆసక్తి తగ్గించారు. గత ఏడాది వేసిన ఇటుకలే ఇప్పటికీ అమ్ముడుపోక అలాగే ఉండిపోవడంతో ఉన్నవి అమ్ముకుంటే చాలు తరువాత చూద్దాంలే అనే పరిస్థితి ఉంది. మామూలుగా ప్రతి ఏడాది నవంబరు, డిసెంబరు నెలలోనే పొరుగున ఉన్న నెల్లూరు, పొదిలి ప్రాంతాల నుంచి వచ్చే కూలీలు ఈ ఏడాది వారి ఛాయలే కనిపించలేదు. ప్రస్తుతం ఒకరిద్దరు, ముగ్గురు మాత్రమే ఎరసాల, కొండుగారిపల్లె ప్రాంతాల నుంచి కొద్దిమంది కూలీలతో ఈ ఇటుకలను వేయిస్తున్నారు. వేరే వ్యాపకం లేక ఇటుకల మీదనే వ్యాపారం చేసేవారం కాబట్టి దాన్ని వదులుకోలేక గతంలో తెచ్చుకున్న మట్టితోనే ఇటుకలను వేయిస్తున్నామని ఇటుకల యజమానులు తెలిపారు. ఏదిఏమైనా ప్రతి ఏడాది వందలాది మంది కూలీలకు ఉపాధిగా ఉంటూ చిన్న కుటీర పరిశ్రమగా ఉన్న ఈ ఇటుకల తయారీ ఈ ఏడాది తగ్గుముఖం పట్టడంతో చాలా మంది ఉపాధి కూడా కోల్పోయారు. మరలా ఇటుకలకు డిమాండ్ ఏర్పడితే తప్ప ఇటుకల యజమానులు బట్టీలు వేసే ఆస్కారం ఉండదు.




ఇటుకలు వేస్తున్న కూలీలు, అమ్మకాలు లేక నిలిచిపోయిన ఇటుక బట్టీలు

పెట్టుబడులు ఎక్కువ.. అమ్మకాలు తక్కువ...



ఇటుకబట్టీల తయారీకి పెట్టుబడులు ఎక్కువయ్యాయి. అమ్మకాలు తక్కువయ్యాయి. ప్రస్తుతం గృహ నిర్మాణాలు కట్టేవారు తక్కువ కావడంతో గతంలో వేసిన ఇటుక బట్టీలు అలాగే నిలిచిపోయాయి. కానీ వేరే వ్యాపారం చేయలేక పాత వ్యాపారం వదులుకోలేక ఈ సారి కూడా అప్పులు తెచ్చి ఇటుక బట్టీ వేశాం.

కల్వకూరి వెంకటసుబ్బయ్య, ఇటుకబట్టీ యజమాని, కమ్మవారిపల్లె

రోస్టర్లలో తప్పులను సవరించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ పాయింట్లలో తప్పులను సవరించి గ్రూప్-2 మెయిన్ పరీక్షలు నిర్వహించాలని గ్రూప్-2 అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రోస్టర్‌పాయింట్లలో తప్పులను సరిదిద్దాలని శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద గ్రూప్-2 అభ్యర్థులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్, డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, సురేష్, హేమశ్రీ, వైష్ణవి, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

ఖాజీపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ కాలనీలో బేస్‌మట్టం కూల్చిన ఘటనలో లక్ష్మీదేవిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు. తుడమలదిన్నె గ్రామానికి చెందిన కూకట్లపల్లె సునీల టీచర్స్ కాలనీలో స్థలం కొని బేస్‌మట్టం నిర్మించుకుంది. అయితే బీసీ కాలనీకి చెందిన లక్ష్మీదేవి ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేసింది. స్థలం నాది, మీరు అక్రమంగా నిర్మించారు అనడంతోపాటు కులంపేరుతో దూషించి దుర్భాషలాడింది. ఆ మేరకు సర్వేయర్ కొలతలు వేసి సునీలది స్థలం అని తేల్చడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కీటకజనిత వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

బద్వేలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కీటక జనిత వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని బద్వేలు, పోరుమామిళ్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంజనేయనగర్ సచివాలయ పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సత్యనారాయణమ్మ, ఆశా వెంకటలక్ష్మి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు పనిభారం తగ్గించాలి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రత్యక్ష నియామకాలు చేపట్టి ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్స్ యూనియన్ కన్వీనర్ సంజీవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీబీ రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద బ్యాంకు ఉద్యోగులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు బ్యాంకు ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు పవన్ కుమార్, కార్యదర్శి సుధాకర్ ,ప్రవీణ్, రాధమ్మ పాల్గొన్నారు.

కొత్త ఎంఈవోగా పద్మలత

దువ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలానికి కొత్త ఎంఈవోగా టి.పద్మలత శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గత ఇన్‌చార్జి ఎంఈవో రవిశంకర్‌స్థానంలో ఆమె ఇక్కడకు వచ్చారు. రవిశంకర్ చాపాడు ఎంఈవోగా వెళ్లారు. అక్కడ ఆయన ఇంతకు మునుపు రెగ్యులర్ ఎంఈవోగా ఉన్నారు.

పేదల ఇళ్లు కూల్చేస్తామంటే తిరుగుబాటు తప్పదు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లను కూలుస్తాం, తొలగిస్తామంటే తిరుగుబాటు తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్ అన్నారు. పేదల ఇళ్లను కూల్చాలనే రెవెన్యూ అధికారుల ప్రయత్నాన్ని నిరసిస్తూ శుక్రవారం భాకరాపేట సమీపంలో ఉన్న సీపీఐ కాలనీలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, జిల్లాసమితి సభ్యులు పడిగ వెంకటరమణ, రూరల్ కార్యదర్శి నాగదాసరిఇమ్మానుయేల్, గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య, కాశినాయన మండల ఇన్‌చార్జి బాలచెన్నయ్య, సునీల్, కేశవ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబన్నపేటలో లేగదూడల ప్రదర్శన పోటీలు

కొండాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఓబన్నపేట గ్రామంలో జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లేగదూడల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 25 లేగదూడలలో ఉత్తమ వాటిని ఎంపిక చేసి రైతులకు పోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ పోటీలలో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను శివప్రసాద్, వెంకటరమణయ్య, మునిరెడ్డి అనే రైతులకు చెందిన లేగదూడలు గెలుచుకున్నాయి. వీరికి మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు. పశువుల డాక్టర్లు శివరామిరెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రాజు, సర్పంచ్ గోపీనాథ్, రైతులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలను జయప్రదం చేయండి

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పెండింగులో ఉన్న ప్రాజెక్టులకు నిధులు, నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మండల కార్యదర్శి జాలాహృదయనాథ్, మండల నాయకుడు పెదుళ్లపల్లె ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు కోసం ఫిబ్రవరి 22, 23, 24 తేదీల్లో కడపలో జరిగే సభను జయప్రదం చేయాలని సీపీఐ నేతలు తెలిపారు.

పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనించాలి

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) :పిల్లల నడవడికలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని మైదుకూరు సీఐ హసం తెలిపారు. స్థానిక మేధా డిఫెన్స్ అకాడమీలో శుక్రవారం ఓ యువత మేలుకో అనే కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో మేధా డిఫెన్స్ అకాడమీ కరెస్పాండెంట్ నరసింహులు, ఎస్ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

మైలవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామ ప్రజలు, రైతులకు దాల్మియా పరిశ్రమ బ్లాస్టింగ్ వలన దుమ్ము, ధూళితో పంటలు పండకపోవడంతో పాటు ఇళ్ల నెర్రలు చీలడం జరుగుతోందని ఆ సమస్యలు పరిష్కరించకుండా దాల్మియా యాజమాన్యం రెండోప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రజాభిప్రాయ సేకరణ జరిగితే దానిని అడ్డుకుంటామని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామాల్లో పర్యటించి దాల్మియా బ్లాస్టింగ్ వలన నెర్రలు చీలిన ఇళ్లను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ దాల్మియా యాజమాన్యం వంకలు, వాగులు ఆక్రమించి పరిశ్రమ నిర్మించడం వలన వర్షాకాలంలో వరదలు వచ్చిన ప్రతీసారి పంట పొలాలతోపాటు గ్రామాలను సైతం వరద ముంచెత్తుతోందన్నారు. దీనిపై అనేకసార్లు యాజమాన్యానికి గ్రామస్థులు మొరపెట్టుకున్నా వారు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. పంట పొలాలకు పరిహారం ఇవ్వడంతోపాటు దుగ్గనపల్లె గ్రామాన్ని వేరేచోటికి తరలించి శాశ్వత పరిష్కారం చూపాలని లోకాయుక్త యాజమాన్యానికి సూచించడం జరిగిందన్నారు. దాల్మియా యజమాన్యం ఇవేమీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపకుండా రెండోప్లాంట్ ఏర్పాటుకు ఈనెల 27న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగితే ఆ కార్యక్రమం జరుగకుండా రైతులు ప్రజలతో కలిసి అడ్డుకుంటామన్నారు. రైతులకు దాల్మియా యాజమాన్యం న్యాయం చేసి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పొన్నరెడ్డి గిరిధర్‌రెడ్డి, సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘు, వైసీపీ మండల నాయకులు మోహన్‌రెడ్డి, ఎర్రబోలు భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దుమ్ము, ధూళితో నిండిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముద్దనూరు ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ముద్దనూరుటౌన్‌లో శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ తెలిపారు.రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా టౌన్‌లోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న వేపచెట్లు తొలగిస్తున్నారన్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన తెలిపారు.

అందుబాటులో యూరియా

గోపవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని అవసరమైన యూరియా రైతులకు అందుబాటులో ఉందని ఏవో రామక్రిష్ణ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. గోపవరం మండలం రాచాయిపేట రైతు సేవా కేంద్రంలో యూరియా ఉందని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. పీఎస్ లిఖిత, ఏఈవో ఓబయ్య ఆయాశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులందరినీ పర్మినెంటు చేయాలి

బద్వేలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలంటూ శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని ఫిబ్రవరి 6వ తేదీ నాడు జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర బాబు, యూనియన్ పట్టణ అధ్యక్షుడు పులి శ్యామ్ ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాలహరి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కూలిరేట్ల జీవో విడుదల చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సివిల్‌సప్లై గోడౌన్లలో పనిచేస్తున్న హమాలీల కూలిరేట్లను పెంచే జీవోను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హమాలీ గోడౌన్ల రేట్లు పెంచాలని సివిల్‌సప్లై గోడౌన్ల డిప్యూటీ తహసీల్దారు లింగుస్వామికి వినతి పత్రం అందజేశారు.

తెలుగుభాషను రక్షించుకుందాం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషను మనందరం రక్షించుకోవాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి మీనాక్షి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దముడియం, జమ్మలమడుగు, మైలవరం, మండలాల్లోని 10వ తరగతి విద్యార్థులకు తెలుగుభాష ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చంద్రశేఖర్‌రావు, చిట్టిబాబు, చౌడయ్య, రమణారెడ్డి,నాగేంద్ర పాల్గొన్నారు.